దేవాదిదేవా.. శ్రీవాసుదేవా



చిన్ననాటి కోరిక తీరింది!

రిటైర్డ్ జస్టిస్ రమణ



వేద సభల్లో పాల్గొనా లనే కోరిక చాలా మందికి ఉంటుంది.. కానీ ఆ అవకాశం కొంత మందికే వస్తుంది.. అలాగే సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు ఆ కోరిక ఉంది. అంబాజీపేట మండలం నందంపూడిలో మంగళవారం నిర్వహించిన వేద సభలో అవకాశం వచ్చింది. దానిలో భాగంగా ఆ కోరికను బయటపెట్టారు. నాకు చిన్నప్పటి నుంచి వేదసభలో పాల్గొనాలనే కోరిక ఉండేదని, తాను నందంపూడి వేదసభలో పాల్గొని వేదఘోషను ఆస్వాదించడంతో నెరవేరిందని రమణ తెలిపారు. వేదసభలో పాల్గొని తన్మయత్వం పొందానని వెల్లడించారు. 7



అష్టదళ పాదపద్మారాధనకు 108 బంగారు పుష్పాలు

దేవాదిదేవా.. వాసుదేవా అంటూ వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామిని భక్తజనం కొలిచారు.. 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఐదో రోజైన మంగళవారం ఆలయంలోని వసంత మండపంలో ఉత్సవమూర్తులు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామిని కన్నులారా చూసి మనసారా వేడుకున్నారు.. మంగళవారం రాత్రి మలయప్ప అలంకరణలో శ్రీవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో విహరించారు.. 6

ప్రజానంద.. పవనాలు!



ఉప్పాడలో గురువారం జరిగిన సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ (ఫైల్‌ఫోటో)

డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు.. నెరవేర్చారు

కొత్తపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్ నాడు హామీ ఇచ్చారు.. అది నేడు నెరవేర్చారు. కేఎస్ఈజెడ్ (కాకినాడ ప్రత్యేక ఆర్థిక మండలి) పరిధిలోని భూములను తిరిగి రైతులకు ఇప్పించేలా బాధ్యత తీసుకుంటానని గత ఎన్నికల సమయంలో పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. ఆ హామీని డిప్యూటీ సీఎం హోదాలో నిలబెట్టుకున్నారు. కాకినాడ సెజ్‌కు ఇచ్చిన భూముల్లో 2,180 ఎకరాలను తిరిగి రైతులకు ఇచ్చి మేలు చేయాలని ఆనాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంది. ఈ మేరకు సెజ్‌లో అవార్డు భూములను తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆదేశాలిచ్చారు. ఈ రిజిస్ట్రేషన్‌కు రుసుములు, స్టాంపు డ్యూటీలు వసూలు చేయవద్దని ఆదేశాలిచ్చారు. దీంతో కాకినాడ జిల్లా కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో 1551మంది రైతులకు మేలు చేకూరనుంది.

సెజ్ రైతులకు ఊరట..

కాకినాడ సెజ్ పరిధిలో రైతులకు వెనక్కిచ్చిన భూమి తిరిగి రైతుల పేరున రిజిస్ట్రేషన్ కాక సతమతమవుతున్నారు. దీంతో డిప్యూటీ సీఎం గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సరిచేస్తూ రైతులకు న్యాయం చేశారు. గత ప్రభుత్వంలో కేఎస్ఈజెడ్ భూములపై జీవోనెం.12 విడుదలైనా క్షేత్ర స్థాయిలో రైతులకు మేలు జరగలేదు. దీంతో పిల్లల పెళ్లిళ్లు, చదువుల నిమిత్తం భూములు ఉపయోగపడడంలేదని రైతులు గతంలో పవన్‌కల్యాణ్‌కు నివేదించారు. దీంతో మేలు జరిగేలా చూస్తానని అప్పట్లో రైతులకు హామీ ఇచ్చారు. ఈ సమస్యను ఇటీవల శాసనమండలి సమావేశాల్లో ప్రభుత్వ విప్ గిడుగు హరిప్రసాద్ కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్య మరోసారి చర్చనీయాంశమైంది. మంగళవారం మధ్యాహ్నం ప్రభుత్వం కాకినాడ సెజ్ రైతులకు స్టాంప్, రిజిస్ట్రేషన్ డ్యూటీని మినహాయించి తిరిగి రైతుల భూములు వారికి తిరిగి రిజిస్ట్రేషన్ చేసేలా ఆదేశాలిచ్చింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

దెబ్బతిన్న బోట్లకు రూ.72 లక్షల పరిహారం

గురువారం సభలో హామీ ఇచ్చి.. నెరవేర్చిన పవన్

కొత్తపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ మినీహార్బర్ వద్ద దెబ్బతిన్న మత్స్యకారుల బోట్లకు ప్రభుత్వం రూ.72 లక్షల నష్టపరిహారం విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. నాలుగు రోజుల కిందట డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మత్స్యకారుల సమస్యలు తెలుసుకునేందుకు కాకినాడ వచ్చారు. అక్కడ కలెక్టరేట్‌లో మత్స్యకార ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఉప్పాడ హార్బర్ డిజైన్ లోపం కారణంగా తమ బోట్లు దెబ్బతిన్న విషయాన్ని మత్స్యకారులు ఆయన దృష్టికి తీసు కెళ్లారు. ఉప్పాడలో జరిగే సభకు వెళుతూ విహంగ వీక్షణం ద్వారా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హార్బర్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. బోట్లు నష్టపోయిన మత్స్యకారులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం డిప్యూటీ సీఎం చొరవతో హార్బర్‌లో దెబ్బతిన్న బోట్లకు రూ.72 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి సీఎం చంద్రబాబుకు డిప్యూటీ సీఎం పవన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు మత్స్యకారులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

- సెజ్ రైతులకు న్యాయం
- 2,180 ఎకరాలు ఇచ్చేలా జీవో
- రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు
- 1551 మంది రైతుల ఆనందం
- బోట్లకు రూ.72 లక్షల పరిహారం

భూముల బదిలీకి ఫీజుల్లేవు

కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ)/కొత్తపల్లి, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎస్ఈజెడ్ భూములను రైతుల పేరున బదిలీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్, స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు పూర్తిగా మినహాయింపు ఇచ్చిందని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం తెలిపారు. ఈ మినహాయింపు 1899 స్టాంపు చట్టం సెక్షన్9 (1) (ఏ), 1908 రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 78 ప్రకారం అమలుచేస్తారని ప్రభుత్వం తెలిపిందన్నారు. ఈ మినహాయింపు రైతుల భూమి బదిలీలకు మాత్రమే వర్తిస్తుంది.

పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం

కొత్తపల్లి, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): సెజ్ భూములు తిరిగి రైతులకే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలని అధికారిక ప్రకటన వెలువడంపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం పవన్ ఫ్లెక్సీలకు ముమ్మిడివారిపాడు, రావివారిపోడు గ్రామాలతోపాటు పొన్నాడ శివారు మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద సెజ్ రైతులు పాలాభిషేకాలు చేశారు. జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, తెలగంశెట్టి శ్రీనివాసరావు, పిల్లా శివశంకర్, బాపన్నదొర పాల్గొన్నారు.





రెండ్రోజులపాటు జరిగే వర్క్‌షాపులో మంగళవారం మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

చిన్న, మధ్య తరహా పరిశ్రమ ఉత్పత్తులపై

అవగాహన పెంచుకోవాలి

- వెండ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం వర్క్‌షాపులో జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఉత్పత్తులకు సమర్థవంతమైన మార్కెటింగ్ లింకేజీ, సప్లయి భాగస్వామ్యంతో పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ చట్టంతో పాలుపంచుకునే అవకాశాలను మరింత పెంపొందించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల కేంద్రం సెంటర్ ఫర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విభాగం, ఎంఎస్ఎంఈ ఉత్పత్తుల కొనుగోలుదారులతో వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహణలో భాగంగా రెండు రోజులపాటు జరుగుతున్న వర్క్‌షాపును కలెక్టర్ మహేష్‌కుమార్ జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్ద సంస్థలు, కేంద్ర, రాష్ట్రాలకు చెందిన పబ్లిక్ సెక్టార్ యూనిట్లతో ప్రత్యక్ష సంబంధాలు కల్పించడం ద్వారా సరఫరాదారుల నైపుణ్యాలను సామర్థ్యాన్ని పెంపొందించడానికి మార్గం సుగమం అవుతుందన్నారు. వినూత్నత, నాణ్యత, ఆదాయాన్ని మెరుగుపరిచేందుకు ఈ వర్క్‌షాపు ఎంతో ప్రయోజనకరమని, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించడం, సంప్రదాయ ప్రదర్శనలు, ఎగ్జిబిషన్లు నిర్వహించడం ద్వారా చిన్న వ్యాపారాలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. సాంకేతిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటకృష్ణ మాట్లాడుతూ ఉత్పత్తి, కొనుగోలు సంస్థల మధ్య ప్రత్యక్ష భేటీల ద్వారా సంబంధాలు బలపడి వ్యాపారాభివృద్ధికి మార్గాలు సుగమం అవుతాయన్నారు. వ్యాపారులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఉన్నాయని, పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్‌లో భాగస్వామ్యం పెరుగుతుందని, ఇన్నోవేషన్, ట్రైనింగ్, కొత్త టెక్నాలజీ పరిచయం ద్వారా ఎంటర్‌ప్రైజెస్ అభివృద్ధిలో పోటీ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ర్యాంపు వంటి ప్రోగ్రాంల ద్వారా గణనీయంగా నిధులు మంజూరవుతాయని చెప్పారు. ఎంఎస్ఎంఈలకు ప్రజా, ప్రైవేటు రంగాల్లో ఆవిష్కరణలు, బిజినెస్ చాన్సులు, మహిళలు, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకాలు ఉన్నాయని, మార్కెట్ యాక్సెస్ పెంచడానికే ఈ కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ, సహాయ సంచాలకుడు శివరామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో చేనేత సంఘాల ప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్, హాజరైన ప్రతినిధులు

చేనేత సంఘాల అభివృద్ధికి పూర్వ వైభవం తేవాలి

సహకార సంఘాల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ సూచన

అమలాపురం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాల అభివృద్ధికి పూర్వ వైభవం సంతరింపజేయడానికి వినూత్న ఆలోచనలతో చేనేత సహకార సంఘాలు ముందుకు సాగాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. నూతన వస్త్రాల తయారీపై చేనేత సంఘాలను అన్నిరకాలుగాను ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో చేనేత, జౌళిశాఖకు చెందిన 23 సహకార సంఘాల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రస్తుత సంఘాల పనితీరును ప్రభుత్వం నుంచి అందిస్తున్న రాయితీలు, సంఘాల బకాయిలు వంటి అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. వ్యవసాయం తర్వాత అత్యధిక జనాభాకు ఉపాధి కల్పిస్తున్న రంగం చేనేత రంగమన్నారు. చేనేతలకు ఉపాధి భారంకాకుండా ప్రోత్సహించడానికి సన్నాహాలు చేయాలని సూచించారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు అందించే సంక్షేమ ఫలాలన్నీ వారికి అందేలా చేయడంతోపాటు ఆర్థిక చేయూత, విద్యుత్ రాయితీలు, మార్కెటింగ్ విధానం వంటి అంశాలపై అన్నిరకాలగాను వారికి ప్రోత్సాహం అందించాలని సూచించారు. కొత్త వస్త్రాలను అరటినార, పీచులతోగానీ చేనేత వస్త్రాలతో కలిపి ఆకర్షణీయంగా రూపొందించేందుకు ప్రయత్నించాలని, ఆ దిశగా చేనేత సంఘాలకు సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చేనేత సంఘాలకు పెండింగ్ బకాయిలు చెల్లింపు నిమిత్తం డీవో లెటర్ రూపొందించాలని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్టు తెలిపారు. 50 ఏళ్లు పైబడిన వారికి రూ.4 వేలు నెలవారీ పింఛను అందిస్తున్నామని, మార్కెటింగ్ ఆధునికీకరణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డీసీసీబీ నుంచి తీసుకున్న రుణాల బకాయిలు చెల్లించలేక కొన్ని సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయని, వాటి పునరుజ్జీవానికి ప్రభుత్వం దశలవారీగా చర్యలు చేపట్టిందని తెలిపారు. అంగర, మండపేట ఏడిద, నేలటూరు సంఘాలు నేచురల్ డైయింగ్ విధానాలపై దృష్టిపెట్టాలని, అవసరమైన సహకారాన్ని జిల్లా యంత్రాంగం అందించాలని సూచించారు. సమావేశంలో చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు కె.పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా పశుదాణా విక్రయానికి ఏర్పాట్లు

జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో తొమ్మిది సొసైటీల ఎంపిక : కలెక్టర్ వెల్లడి

అమలాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి పోషక విలువలు కలిగిన ప్రోటీన్ టోటల్ మిక్సర్ రేషన్ సొసైటీల ద్వారా అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పశుసంవర్థకశాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం జరిగింది. పాలదిగుబడి పెంచే దిశగా మిక్సెడ్ దాణా సరఫరా కోసం కార్యాచరణపై సమీక్షించారు. కోనసీమలో పాడి పరిశ్రమ అభివృద్ధికి సొసైటీల ద్వారా మిశ్రమ దాణాను లాభాపేక్ష లేకుండా రైతులకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ముందుగా సంఘాల పరిధిలో గేదెల యూనిట్లను గుర్తించి ఆ ప్రకారం ముందుగా కంపెనీల ద్వారా ఎంపిక చేసిన టెండర్లకు అనుగుణంగా దాణా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పాడి రైతులు కొనుగోలు చేసుకునే తమ పశువులకు పోషక విలువలు కలిగిన దాణాను అందించడం ద్వారా పాల దిగుబడి పెంచేందుకు కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. పాడి రైతులకు దాణా విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను పశు సంవర్థకశాఖ అధికారులు తన దృష్టికి తీసుకురాగా, జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో తొమ్మిది సొసైటీల్లో విక్రయించడానికి వీలుగా దాణా తయారీ పరిశ్రమలతో ఇప్పటికే సంప్రదింపులు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. సమీక్షలో పశుసంవర్థకశాఖ అధికారి వెంకట్రావు, డీడీ కె.మూర్తి, ఏడీ ఉమామహేశ్వరరెడ్డి, సొసైటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



47 ఏళ్ల తర్వాత పంటల జాతర

సారెతో మహిళలు

కాట్రేనికోన, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెయ్యేరులో 47 ఏళ్ల అనంతరం మంగళవారం పంటల జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత దాసులమ్మకు ఘనంగా నైవేద్యం సమర్పించారు. 47 సంవత్సరాల కిందట వరకు ఏటా అమ్మవారికి పంటల జాతర నిర్వహించేవారు. పంటల జాతరతో గ్రామంలో పంటలు సమృద్ధిగా పండి గ్రామం అభివృద్ధి పథంలో ఉండేదని అప్పట్లో ప్రజల విశ్వాసం. అయితే గ్రామస్తుల మధ్య తలెత్తిన వివాదాలతో పంటల జాతర నిలిపివేశారు. అప్పటి నుంచి గ్రామంలో పంటలు సరిగా పండకపోవడం, గ్రామంలో క్రమంగా ఐక్యత లోపించడంతో గ్రామస్తులు ఇబ్బందులకు గురయ్యారు. ఇదంతా పంటల జాతర ఆపివేయడం వల్లే జరిగిందని నమ్మిన ప్రజలు ఈనెల 7వ తేదీ నుంచి 14 వరకు పంటల జాతర నిర్వహించారు. గ్రామ మహిళలు మంగళవారం ర్యాలీగా తరలివచ్చి దాసులమ్మతోపాటు మరిడమ్మ, ముత్యాలమ్మకు గండ్ర దీపాలు, సారె, మహా నైవేద్యం సమర్పించారు. చెయ్యేరు హైస్కూల్ 2002-03 టెన్త్ బ్యాచ్ మహిళలు రూ.1.25 లక్షల విలువైన పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు మహిళలకు పంపిణీ చేశారు.



శివకోడులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటనకు రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ నిషాంతి, రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్ తదితరులు

17న డిప్యూటీ సీఎం పవన్ పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన జేసీ, రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్

రాజోలు, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): సీఎం పవన్‌కల్యాణ్ ఈనెల 17న రాజోలు మండలం ములికిపల్లి, శివకోడులలో పర్యటన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, అమలాపురం ఆర్డీవో మాధవి, డీఎస్పీ మురళీమోహన్ మంగళవారం పర్యటించి రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ములికిపల్లి నుంచి కాట్రేనిపాడుకొడప వరకు ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.3.21 కోట్లతో 4.4 కిలోమీటర్ల రోడ్డుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ శంకుస్థాపన చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. అనంతరం శివకోడులో శ్రీమంగెన గంగయ్య తెలగా కల్యాణ మండపంలో ఉన్న లేఅవుట్‌లో పల్లెపండుగ 2.0 నిర్వహిస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. శివకోడు జాతీయ రహదారి 216 పక్కనే ఉన్న లేఅవుట్లలో హెలీప్యాడ్ స్థల ఏర్పాట్లపై పరిశీలించారు. కార్యక్రమంలో గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, ఎంపీపీ కడలి శ్రీదుర్గ, చాగంటి స్వామి, అడబాల విజయ్, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, బి.సావరం నీటిసంఘ అధ్యక్షుడు ఉలిశెట్టి లక్ష్మణరావు, సర్పంచ్‌లు గిడుగు బుజ్జి, కోటిపల్లి రత్నమాల, తాటిపాక సొసైటీ అధ్యక్షుడు గుండాబత్తుల తాతాజీ, అడబాల సత్యరమేష్, గిడుగు చంద్రశేఖర్, సూరిశెట్టి శ్రీనివాస్, కడలి మోహన్, తహశీల్దార్ సీహెచ్ భాస్కర్, పంచాయతీరాజ్ డీఈఈ కేవీ కృష్ణంరాజు పాల్గొన్నారు.

మలికిపురంలో..

మలికిపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కేశనపల్లిలో శంకరగుప్తం డ్రెయిన్ పోటు వల్ల నష్టపోయిన ప్రాంతాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పరిశీలించనున్న నేపథ్యంలో జేసీ టి.నిషాంతి, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పరిశీలన చేశారు. హెలిప్యాడ్ ఏర్పాటుచేసే ప్రాంతాన్ని, రైతులతో ముఖాముఖి చర్చించే ప్రాంతాన్ని, పవన్ పరిశీలించే చనిపోయిన కొబ్బరి చెట్ల ప్రాంతాన్ని వీరు పరిశీలించారు.



అమలాపురం హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సలీంబాషా

ప్రశ్న ఏవిధంగా అడిగినా విద్యార్థులు సమాధానం రాయగలగాలి

డీఈవో సలీంబాషా

అమలాపురంటౌన్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో ప్రశ్న ఏవిధంగా అడిగినప్పటికీ విద్యార్థులు సమాధానం రాసేవిధంగా వారిని తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా సూచించారు. కొంకాపల్లి జవహర్‌లాల్‌నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి అనంతరం హెచ్‌ఎం సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో డీఈవో పాల్గొన్నారు. పాఠ్యాంశాల్లోని కంటెంట్‌పై అవగాహన ఉన్నప్పుడు మాత్రమే అప్లికేషన్ మెథడ్‌లో విద్యార్థులు ప్రశ్నలకు సమాధానాలు రాయగలరన్నారు. బట్టీపట్టే విధానాలకు పూర్తిగా స్వస్తి పలకాలన్నారు. విద్యార్థుల్లో ఆలోచనా విధానాన్ని సూచించే విధంగా తార్కిక ఆలోచనలను పెంచుకునేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి ప్రశ్నాపత్రాలను అప్లికేషన్ మెథడ్స్‌లో రూపొందిస్తున్న విధానాన్ని గమనించాలన్నారు. అసెస్‌మెంట్ బుక్‌లెట్స్‌లో విద్యార్థులు సమాధానాలు రాస్తున్న విధానాన్ని పరిశీలించాలన్నారు. పదో తరగతి విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సబ్జెక్టుల వారీగా ప్రతీ వారం విద్యార్థుల ప్రగతిని హెచ్‌ఎం సమీక్షించాలన్నారు. పరీక్షలు జరుగుతున్న విద్యార్థుల తరగతి గదులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులను అభినందించారు. సమగ్రశిక్ష ఏఎంవో పి.రాంబాబు వెంట ఉన్నారు.



యానాం.. జలమయం!

ఎడతెరిపిలేని భారీ వర్షం 7


ఇందుపల్లిలో శిక్షణ ఇస్తున్న దుర్గాప్రసాద్
కూచిపూడి నృత్యం చేస్తున్న ఆదుర్తి లక్ష్మీ సుస్మిత

అందెల రవమిది పదములదా!

లయబద్ధమైన సంగీతానికి అనుగుణంగా అవయవాలన్నింటినీ కదుపుతూ చేసే కూచిపూడి నృత్యాన్ని తిలకించేందుకు రెండు కళ్లూ చాలవు. కూచిపూడి నృత్యానికి, భరత నాట్యానికి పోలికలు ఉన్నప్పటికీ వేటికవే ప్రత్యేకత సంతరించుకున్నాయి. సంప్రదాయ కళాకారులు కూచిపూడి నృత్యానికి ఆధునిక హంగులు అద్దుతూ వేలాది మందికి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. కృష్ణా జిల్లా కూచిపూడిలో పుట్టిన ఆ నృత్యానికి ఆ గ్రామం పేరు రావడం విశేషం. కూచిపూడి నృత్యానికి ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం తీసుకువచ్చిన ఘనత 'పద్మభూషణ్' డాక్టర్ వెంపటి చిన సత్యంకు దక్కుతుంది. ఆయన జయంతిని పురస్కరించుకుని ప్రతిఏటా అక్టోబరు 15వ తేదీని ప్రపంచ కూచిపూడి నృత్య దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ శాస్త్రీయ నృత్య రూపకాన్ని సాధన చేసేందుకు ఎందరో విద్యార్థులు ముందుకు వస్తున్నారు. వారికోసం పట్టణాల్లోనే కాదు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

WORLD KUCHIPUDI DAY OCTOBER 15

నేడు అంతర్జాతీయ కూచిపూడి నృత్య దినోత్సవం

(అమలాపురం రూరల్-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లికి చెందిన నాగిరెడ్డి దుర్గాప్రసాద్ శ్రీరామాంజనేయం డ్యాన్స్ అకాడమీ ఏర్పాటుచేశారు. ఆయన వద్ద వివిధ గ్రామాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు కూచిపూడి నృత్యంలో తర్ఫీదు పొందారు. ఇటీవల రాజమహేంద్రవరం లాస్యప్రియ కూచిపూడి నృత్య నికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ డ్యాన్స్ అండ్‌మ్యూజిక్ ఫెస్టివల్‌లో దుర్గాప్రసాద్ శిష్యులు అద్భుత ప్రతిభ చాటారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో శ్రీరామాంజనేయం అకాడమీ చోటు సాధించింది. కూచిపూడి నృత్యబాల పురస్కారాలు అందించారు. గురువు దుర్గాప్రసాద్ 'నాట్యకళాబ్రహ్మ' పురస్కారం అందుకున్నారు.

ప్రధాన దేవాలయాల్లో ప్రదర్శనలు...

శ్రీరామాంజనేయం డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో కూచిపూడి నృత్య కళా రూపకాలను ప్రదర్శించారు. తొలుత అయినవిల్లి సిద్ధివినాయకుని ఆలయంతో ప్రారంభించి... వాడపల్లి, అన్నవరం, అప్పనపల్లి, విజయవాడ దేవస్థానాల్లో ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారు. వినాయకచవితి, దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో రాష్ట్రవ్యాప్తంగా 300కు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. కళా కృషికి గాను గురువు దుర్గాప్రసాద్ వివిధ నృత్య సంస్థల నుంచి నృత్యశ్రీ, నాట్యశౌరి, నాట్య కళాబ్రహ్మ పురస్కారాలు అందుకున్నారు.


రాజమహేంద్రవరంలో జాతీయ స్థాయి పోటీల్లో పురస్కారాలు అందుకున్న అకాడమీ విద్యార్థులు

కూచిపూడి నృత్యంపై ఆసక్తి పెరుగుతోంది

నాగిరెడ్డి దుర్గాప్రసాద్, గురువు, ఇందుపల్లి



ప్రస్తుత ఇంటర్నెట్ యుగంలో కూచిపూడి నృత్యానికి అంతర్జాతీయంగా ఆదరణ పెరిగింది. నృత్యంపై ఆసక్తి కలిగిన చిన్నారులను 'నాట్య మయూరి'లుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నా. చదువులో ఏకాగ్రతకు, మానసిక వికాసానికి, ఉల్లాసానికి కూచిపూడి నృత్యం దోహదపడుతుంది. భామాకలాపంతో పాటు ఎన్నో నృత్యరీతుల్లో శిక్షణ ఇస్తున్నాం.


వసంత మండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, చైర్మన్, ఈవో దంపతులు


మలయప్ప అలంకరణలో గరుడ వాహనంపై స్వామివారు

దేవాదిదేవా... శ్రీవాసుదేవా

- మలయప్ప అలంకరణలో శ్రీవారు
- గరుడ వాహనంపై విహరించిన వేంకటేశ్వరస్వామి
- కనుల పండువగా అష్టదళ పాదపద్మారాధన
- వాడపల్లిలో ఐదో రోజుకు 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు



ఆత్రేయపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతు న్నాయి. ఐదో రోజైన మంగళవారం ఆలయంలోని వసంత మండపంలో ఉత్సవమూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సప్తకలశారా ధన, మహా స్నపనం, వసంతోత్సవంలను వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి పాదాల చెంత 108 బంగారు పుష్పాలతో అష్టదళ పాదపద్మారాధనను కనుల పండువగా నిర్వహించారు. తొలుత బండారు దంపతులు గజమాలతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామివారికి సమర్పించారు. సాయంత్రం హోమాలు, హనుమత్ మూలమంత్ర హవనం, అష్టోత్తర శత కలశారాధన, పంచశయ్యాధివాసము, ఏకాంత సేవ జరిపారు. రాత్రి మలయప్ప అలంకరణలో శ్రీవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో విహరించారు. జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ దంపతులు, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.

మహిళల కోలాటం, నాగపూర్‌కు చెందిన బ్యాండ్ వాయిద్యాలు, ఉత్తరప్రదేశ్ కాశీకి చెందిన అఘోరాల విన్యాసాలు, తెలంగాణకు చెందిన బోనాలు, శక్తివేషాలు అలరించాయి. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు వీటిని ఆసక్తిగా తిలకించారు.



డ్రమ్స్ కొట్టిన బండారు...

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి సన్నిధికి చేరుకున్నారు. వాడపల్లి ముఖ ద్వారం వద్ద అన్నవరం సత్యనారాయణస్వామి రథయాత్రను తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. డ్రమ్స్ కొట్టి స్టెప్పులు వేసి అందరినీ ఉత్సాహపరిచారు.



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు దంపతులు, ఆకట్టుకున్న అఘోరాల ప్రదర్శన

గెలుపు, ఓటములు సహజం

- నవంబరులో రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలు
- సెట్రాజ్ డిప్యూటీ డైరెక్టర్ రామకృష్ణ
- నన్నయ యూనివర్సిటీలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు


వివేకానంద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ, డీడీ

దివాన్‌చెరువు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గెలుపు, ఓటమి సహజమని, పోటీల్లో పాల్గొనడమే ముఖ్యమని రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీఎస్ రామకృష్ణ చెప్పారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్) ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2025ను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ, సెట్రాజ్ డీడీ రామకృష్ణ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ యువతలో అంతర్లీనంగా ఉన్న ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు యువతను సెట్రాజ్ ద్వారా ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్రస్థాయి యువజనోత్సవాలను నవంబరు నెలలో అమరావతిలో నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాస్థాయి ఉత్సవాలు ఇప్పటివరకూ కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల్లో జరిగాయని అన్నారు. మిగిలిన జిల్లాల్లో కూడా పూర్తయిన తర్వాత రాష్ట్రస్థాయి ఉత్సవాల తేదీలను నిర్ణయిస్తామన్నారు. జాతీయ స్థాయి యువజనోత్సవాలు వచ్చే ఏడాది జనవరి 10,11, 12 తేదీల్లో ఢిల్లీలో జరుగుతాయని చెప్పారు.

వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని చదువుతో పాటు సాంస్కృతిక, క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. కాగా ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ఇన్నోవేషన్ ట్రాక్ సైన్స్ మేళా ప్రదర్శనలో వంగ అయ్యప్ప బృందం, జానపద నృత్యం (బృందం)లో ఎస్‌ఆర్ఎస్. గ్రూపు, జానపద గేయాలు (గ్రూపు)లో తాతరాజు గ్రూపు, ఉపన్యాసంలో విదూషీ శాండిల్య, కథ రాయడంలో బి.జ్ఞానరామ షర్మిల, పెయింటింగ్‌లో మహ్మద్ సమీర్, కవిత్వంలో జి.ధృవీత్ ప్రథమ స్థానాల్లో నిలిచారు. వీరంతా జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్టు సంబంధిత అధికారులు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి 944 మంది ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా సెట్రాజ్ సీఈవో కేఎస్‌వీ కాశీవిశ్వేశ్వరరావు, న్యాయనిర్ణేతలు పాల్గొన్నారు.


జానపద నృత్యం ప్రదర్శిస్తున్న యువతులు

పీఎం-వీబీఆర్‌వై పథకంలో నమోదు కావాలి


కార్యక్రమంలో పాల్గొన్న సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ ప్రతినిధులు

కాకినాడ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం అందించే ప్రయోజనాలు పొందడానికి యజమానులందరినీ పీఎం-వీబీఆర్‌వై పథకం కింద నమోదు చేయాలని అదనపు సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పి.వీరభద్రస్వామి తెలిపారు. కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్‌లో పీఎం-వీబీఆర్‌వైపై ఈపీఎఫ్ అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి మాట్లాడుతూ పీఎం-వీబీఆర్‌వై పథకం లక్ష్యాలు, ప్రయోజనాలను వివరించారు. ఉపాధి ఉత్పత్తిని ప్రోత్సహించడంలో, శ్రామికశక్తికి సామాజిక భద్రత కవరేజీని విస్తరించడంలో దాని పాత్రను వివరించారు. ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు కలువాయి కూడా పథకం ప్రయోజనాలను వెల్లడించారు. ఆర్థిక, సామాజిక శ్రేయస్సును నిర్ధారించడానికి చొరవను ఉత్తమంగా ఉపయోగించుకోవాలని యజమానులు, కార్మికులను కోరారు. కార్యక్రమంలో కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.మురళీధర్, జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి, జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శిరీషా తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ రాజేష్ కుమార్, కాకినాడ సీ పోర్ట్స్ లిమిటెడ్, హెచ్‌ఆర్ ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు, రేపు 'నన్నయ'లో ఆహార మహోత్సవ ప్రదర్శన

దివాన్‌చెరువు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఫుడ్, సైన్స్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 15,16 తేదీల్లో ఆహార మహోత్సవ ప్రదర్శన జరుగుతుందని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్యానర్‌ను మంగళవారం ఆమె ఆవిష్కరించారు. అలాగే అకడమిక్ ఈవెంట్స్‌ను ప్రారంభించారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆసక్తి గల వారు వంటలు సిద్ధం చేసుకుని విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ప్రదర్శించవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, విభాగాధిపతి డి.కళ్యాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికి మిగిలి ఉన్న సీట్లుకు ఐదవ విడత ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలియజేశారు. ప్రవేశానికి iti.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఈనెల 16వ తేదీ సాయంత్రం 2గంటల్లోపు అభ్యర్థి ఏ కళాశాలలో చేరాలో ఆ ఐటీఐలను తప్పనిసరిగా ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఎంపిక చేసుకోవాలన్నారు. మొదటి, రెండవ, మూడవ, నాల్గవ విడతల్లో ఐటీఐ సీట్లు రాని అభ్యర్థులు కూడా తప్పనిసరిగా ప్రవేశానికి ఐదవ విడతలో మరలా కొత్త రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న అభ్యర్థులంతా దగ్గరలోని ప్రభుత్వ లేదా ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో ఈనెల 16వ తేదీ సాయంత్రం 4గంటల్లోపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోవాలని లేకుంటే కౌన్సెలింగ్‌కు అర్హులు కాదని వేణుగోపాలవర్మ తెలిపారు. మరిన్ని వివరాలకు 0884 2348182, 94404 08182 నెంబర్లను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఈ నెల 17వ తేదీ ఉదయం 8గంటల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

భారతదేశ విజ్ఞానమే అన్నింటికీ మూలం

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు
- రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు


సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక శాస్త్ర, సాంకేతికతకు భారతదేశ విజ్ఞానమే మూలం అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో 'ప్రాచీన భారత జ్ఞాన పునరుజ్జీవనం-ప్రపంచ సమస్యల పరిష్కారానికి ఒక నిధి' అనే అంశంపై నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు తొలిరోజు మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానానికి ప్రాచీనకాలంలో భారతదేశ విజ్ఞానమే ఒక పునాదిగా నిలిచిందని, విద్యార్థులు, అధ్యాపకులకు మన సంస్కృతి, వారసత్వం పట్ల అవగాహన పెంపొందించడానికి ఇలాంటి సదస్సులు దోహదపడతాయని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం మాట్లాడుతూ మన పురాతన భారతీయ జ్ఞాన సంపద గత వైభవం మాత్రమే కాదని, నేటి ప్రపంచ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను అందించగల శక్తివంతమైన సాధనమని అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆర్కియాలజీ రిటైర్డు ప్రొఫెసర్ డి.భాస్కర మూర్తి మాట్లాడుతూ వేదం, ఉపనిషత్తు యోగం, వాస్తు, వ్యవసాయం, గణితం, ఖగోళ శాస్త్రాలన్నీ మన పూర్వీకులు సాధించిన అసాధారణ విజయాలని అన్నారు. ప్రసిద్ధ నాటకకర్త వాడ్రేవు సుందరరావు మాట్లాడుతూ భారతీయ నాటక రంగం ప్రపంచానికి తలమానికమైనదని అన్నారు. కాలేజియేట్ ఎడ్యుకేషన్ జేడీ చప్పిడి కృష్ణ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సదస్సులో చీమలమర్రి శ్రీనివాస శర్మ, డి.కిరణ్‌కాంత్ చౌదరి, పసుమర్తి శ్రీనివాస్ శర్మ, సి.స్వరూపరాణి తదితరులు పరిశోధనాత్మక పత్రాలను చదివి వినిపించారు. సదస్సుకు 225 మంది తమ గోష్టిపత్రాలను పంపించారని కో-కన్వీనర్ వై.స్వర్ణశ్రీ తెలిపారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతులమీదుగా సావనీర్ ఆవిష్కరించారు. సదస్సులో పది మంది విదేశీ విద్యార్థులు జింబాబ్వే, జాంబియా, సౌత్ ఆఫ్రికా, కంబోడియా నుంచి పాల్గొన్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

జాతీయ తైక్వాండో పోటీలకు హరిప్రియ ఎంపిక



అంబాజీపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలలో అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కుడుపూడి కావ్యసుందరి హరిప్రియ మొదటి స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు సాయిరామ్, పీడీలు కుంపట్ల ఆదిలక్ష్మి, ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ నెల 10 నుంచి 12 వరకూ బాపట్ల జిల్లా పేటేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్ పోటీల్లో 20 కిలోల విభాగంలో ప్రతిభ కనబరిచిందని, పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. విద్యార్థినిని పీఈటీ అందె సూర్య కుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర బాక్సింగ్ పోటీల్లో శివకోడు విద్యార్థులకు పతకాలు



రాజోలు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా ఇటీవల రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో శివకోడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయుడు ఎన్.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. అండర్-14 విభాగంలో కానూరి శివచరణ్, అండర్-17 విభాగంలో పాలపర్తి విజయ్‌కుమార్ కాంస్య పతకాలు సాధించాడని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలను సాధించిన క్రీడాకారులను సర్పంచ్ నక్కా రామారావు, ఎంపీటీసీలు బొడ్డు కృష్ణారావు, ఉంద్రు సూర్యారావు, పీఎంసీ చైర్మన్ అప్పారి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, బాక్సింగ్ కోచ్ బొంతు మధుకుమార్ అభినందించారు.

పంచారామ క్షేత్రాల దర్శనానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా పంచారామ క్షేత్రాల దర్శనానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు ఆర్టీసీ కాకినాడ డిపో మేనేజరు ఎంయూవీ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపోలో ఆన్‌లైన్ రిజర్వేషన్ కూడా ప్రారంభించనున్నట్టు తెలిపారు. పంచారామ క్షేత్రాల స్పెషల్స్ ఈ నెల 25, 26, నవంబరు 1, 2, 8, 9, 15, 16 తేదీల్లో ప్రతి శనివారం, ఆదివారం కాకినాడలో రాత్రి 8 గంటలకు బయల్దేరి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోట దర్శనాలు పూర్తయిన తర్వాత మరుసటి రోజు రాత్రి 8 గంటలకు కాకినాడ చేరతాయని చెప్పారు. టిక్కెట్లు కావాల్సిన వారు ఆర్టీసీ ఆథరైజ్డ్ ఏజెంట్ల వద్ద (లేదా) ఆర్టీసీ వెబ్‌సైట్ www.apsrtconline.inలో తీసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 99592 25564, 73829 10869, 73829 10569, 73829 10658, 94928 33885 నెంబర్లను సంప్రదించాలన్నారు.

డొంకరాయి నుంచి దిగువకు 10,000 క్యూసెక్కులు


జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

మోతుగూడెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి దిగువకు 10,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు జెన్‌కో అధికారులు మంగళవారం తెలిపారు. డొంకరాయి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1037 అడుగులు కాగా అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా డొంకరాయి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు మంగళవారం నాటికి 1036.50 అడుగులకు నీటి మట్టం చేరుకుంది. దీంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమై జలాశయ నీటి మట్టం ప్రమాదస్థాయికి చేరుకోకుండా 1036.50అడుగుల వద్ద స్థిరంగా నీటి మట్టం కొనసాగేలా జలాశయం నుంచి ఆరో నెంబర్ గేటు ద్వారా 0.84 అడుగుల ఎత్తి దిగువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం డొంకరాయి పవన్ కెనాల్ ద్వారా మరో 4000 క్యూసెక్కులను విడుదల చేస్తున్నట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు డొంకరాయి జలాశయానికి 5000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోందని పేర్కొన్నారు.

యానాం.. జలమయం!

ఎడతెరిపిలేని భారీ వర్షం

నీట మునిగిన రోడ్లు

పిడుగుపాటుకు సిమెంట్ పిల్లర్ ధ్వంసం


జలమయమైన ఓ రోడ్డు


నీట మునిగిన పిల్లారాయస్వామి ఆలయం

యానాం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): యానాంలో మంగళవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో 3 గంటలు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులు విపరీతంగా వీయడంతో పలుచోట్ల వృక్షాలు నేల కొరిగాయి. యానాంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు క్రీడా ప్రాంగణాలు చెరువులను తలపించాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణా ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల సమీపంలో వర్షంనీరు నిలిచిపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పిళ్లారాయస్వామి ఆలయం, పోలీస్‌స్టేషన్ సముదాయాలు నీటమునిగాయి. ప్రధానంగా అన్ని రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. కురసాంపేట గ్రామంలో కొబ్బరి చెట్టుపై, అలాగే గుండాబత్తుల సూర్యనారాయణ ఇంటిపై పిడుగు పడడంతో మూడు అడుగులున్న కాంక్రీట్ పిల్లర్ పగిలిపోయి చెల్లాచెదురైంది. దీంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సంఘటనతో నాలుగు టీవీలు, ఎనిమిది సీలింగ్ ఫ్యాన్లు కాలిపోయినట్టు బాధితులు తెలిపారు.


కళాశాలకు వెళ్లే విద్యార్థుల ఇక్కట్లు


యానాంలో చెరువును తలపిస్తున్న జూనియర్ కళాశాల ప్రాంగణం

వేదాలు, వేదపండితులకు ఎల్లప్పుడు గౌరవం

- వేదసభలో పాల్గొని తన్మయత్వం పొందా
- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ
- కోనసీమ జిల్లా నందంపూడిలో వేద సభ


నందంపూడిలో రమణకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న వేదపండితులు, సభలో పాల్గొన్న రమణ

అంబాజీపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేదాలు, వేదపండితులకు ఎల్లప్పుడు మంచి గుర్తింపు, గౌరవం ఉంటుందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం నందంపూడిలో వడ్లమాని లక్ష్మీనారాయణ అవధాని స్మృతియుర్థం ఆయన కుమారుడు సుబ్రహ్మణ్య ఘనపాటి ఆధ్వర్యంలో వడ్లమాని లక్ష్మీనారాయణ మోమోరియల్ ట్రస్టు పేరిట వేద సభ మంగళవారం నిర్వహించారు. సభకు మహా మహోపాధ్యాయ శాస్త్ర నిధి విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వేదసభలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వేద సభలు నిర్వహిస్తే వేదాల ప్రాశస్త్యాన్ని విశ్వవ్యాప్తంగా చాటి చెప్పడంతో పాటు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లని.. దక్షిణ భారతదేశంలోని కోనసీమ ప్రాంతం వేద పండితులకు పుట్టిల్లన్నారు. నాకు చిన్నప్పటి నుంచి వేదసభలో పాల్గొనాలనే కోరిక ఉండేదని, తాను నందంపూడి వేదసభలో పాల్గొని వేదఘోషను ఆస్వాదించడంతో చిన్ననాటి కోరిక నెరవేరిందని రమణ తెలిపారు. వేదసభలో పాల్గొని తన్మయత్వం పొందానన్నారు. తొలుత నందంపూడి చేరుకున్న ఆయనకు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అలాగే వడ్లమాని లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో రమణ కుటుంబసభ్యులు కొద్దిసేపు మాట్లాడారు. తాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సమయంలో తిరుపతిలో తనతో సుబ్రహ్మణ్యఘనాపాటి తీయించుకున్న ఫొటోలను చూసి ఆనందంపొందారు. వేంకటేశ్వర స్వామి దయ వల్ల తాను ఆ పదవిలో ఎంతో సమర్థవంతంగా పనిచేశానన్నారు. కార్యక్రమం అనంతరం వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని మనువడు ప్రముఖ వేదపండితులు ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్య రవితేజ ఘనాపాటికి జస్టిస్ రమణ సింహతలాటాన్ని అలకరించి సత్కరించారు. లక్ష్మీనారాయణ అవధాని మోమోరియల్ ట్రస్టుకు రూ.2లక్ష చెక్కును విరాళంగా అందించారు. జస్టిస్ రమణకు తహశీల్దార్ చిన బాబు, సీఐ రుద్రరాజు భీమరాజు మొక్కలను అందించి ఘనస్వాగతం పలికారు. బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పీకే రావు, టీటీడీ బోర్డు మాజీ డైరక్టర్ డొక్కా నాథ్‌బాబు, ఎంపీటీసీ వడ్లమాని పద్మావతి, పితాని వీరాస్వామి, అరిగెల బలరామమూర్తి, వేదపండితులు పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానంలో శాంతిహోమం


హోమక్రతువు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం అన్నవరం దేవస్థానంలో చేపట్టిన శాంతిహోమం మంగళవారం కొనసాగింది. పండితులు మన్యసూక్తపారాయణ, చండీ పారాయణ, శ్రీ మత్‌త్రిపాద్విభూతి తది తర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి, వైదిక కార్యక్రమాలు ముగియనున్నాయి.

ఏం సమాచారమొచ్చిందో..!

కాకినాడ సీ, యాంకరేజ్ పోర్టులను ఆకస్మికంగా పరిశీలించిన ఎస్పీ


కాకినాడ సీ పోర్టులో ఎస్పీ బిందుమాధవ్


పోర్టులో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

కాకినాడ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సీ పోర్టు, యాంకరేజ్ పోర్టులను కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి భద్రతా వ్యవస్థలను పరిశీలించారు. పోర్టు నిర్వహణలో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులలో పొందుపరిచిన విషయాలను క్షుణ్ణంగా గమనించారు. పీఆర్‌వో సబ్ ఇన్‌స్పెక్టర్ పి.పవన్‌కుమార్, ఏపీ ఆర్వో సిబ్బందికి తగు మార్గదర్శకాలు ఇచ్చారు. అలాగే పోర్టు పరిధిలోని చెక్‌పోస్టుల పనితీరుపై ప్రత్యక్షంగా ఆరా తీశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందిని కలిసి భద్రతా అంశాలపై దృష్టి సారించారు. చెక్‌పోస్టు సిబ్బందికి భద్రత, విజిలెన్స్, రికార్డ్ మేనేజ్‌మెంట్ సంబంధిత అంశాలపై స్పష్టమైన సూచనలు అందించారు. కాకినాడ సీపోర్ట్స్ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ కెప్టెన్ జాకబ్ సత్యరాజు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీనివాసరావు, సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యనారాయణ తదితరులు పోర్టులో భద్రతా చర్యలపై వివరాలు సమర్పించారు. పోర్టు భద్రతను మరింత బలోపేతం చేయడానికి సాంకేతిక పరికరాలు సీసీ టీవీ పర్యవేక్షణ, అలర్ట్ రెస్పాన్స్ సిస్టమ్‌ను మరింత సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. భద్రతా చర్యల్లో ఎటువంటి అలసత్వం ఉండకూడదని, అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆకస్మిక పర్యటనతో అక్కడ పోర్టు అధికారులు అలర్ట్ అయ్యారు. భద్రతను ముమ్మరం చేశారు. ఏదైనా ఉపద్రవం ఏమైనా తలెత్తే అవకాశం ఉందా? అన్నట్టుగా కంగారు పడ్డారు. ఇది సాధారణ తనిఖీనా లేక ఏమైనా సమాచారం వచ్చిందా? అని ఆశ్చర్యపోయారు. మరోవైపు బిందుమాధవ్ కూడా ఈ మధ్య కాలంలో ఇలా పోర్టులో ఆకస్మిక పర్యటనలు చేసిన దాఖలాలు లేవు. మొత్తానికి ఆయన పర్యటన వెనుక అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తీర ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేసేందుకే ఆయన పర్యటన చేశారా? మరే ఇతర కారణమేదైనా ఉందా? అనేది అంతుచిక్కడం లేదు.

మల్లాంలో గ్యాస్‌లీక్

చెలరేగిన మంటలు

ముగ్గురికి తీవ్రగాయాలు


మల్లాంలో గాయపడిన వ్యక్తి

పిఠాపురం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లాంలో మంగళవారం రాత్రి గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామంలోని మల్లెపాముల వీర నాగేశ్వరరావు ఇంటిలో వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు, అతడి భార్య నాగలక్ష్మి, అన్నయ్యతో మాట్లాడేందుకు వచ్చిన తమ్ముడు లోవరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి ఏడుస్తున్నాడని బయటకు రావడంతో నాగేశ్వరరావు ఇద్దరి పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ముగ్గురిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏటిమెరక ఓఎన్జీసీ సైట్‌లో గ్యాస్ లీక్

ఉప్పలగుప్తం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం పంచాయతీ ఏటిమెరక ఓఎన్జీసీ సైట్‌లో మంగళవారం గ్యాస్‌లీకేజీతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గ్యాస్ పైప్‌లైన్‌లో ఏర్పడిన లీకేజీని ఓఎన్జీసీ టెక్నికల్ సిబ్బంది సరిచేశారు. కొద్దిసేపటికి పైప్‌లైన్ ప్రదేశంలో నీటిబుడగలు ఎగదన్నడంతో స్థానిక పెద్దలు ఓఎన్జీసీ అధికారులకు సమాచారమందించారు. పైప్‌లైన్ ఎప్పుడు పగిలి గ్యాస్ ఎగదన్నుతుందోనని పరిసరప్రాంతాల మహిళలు ఆందోళనచెందుతున్నారు.

ప్రజలపై కొండముచ్చు దాడి

మాగాంలో బంధించిన అటవీశాఖాధికారులు


కొండముచ్చును బంధించిన అధికారులు



అయినవిల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం మాగాం గ్రామంలో గత కొన్నిరోజులుగా ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్న కొండముచ్చును అటవీశాఖ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గత ఆరు నెలల నుంచి మాగాం గ్రామంలో కొండముచ్చు నివసిస్తుంది. గ్రామస్తులు దానికి ఆహారం పెడుతున్నారు. గత రెండు రోజుల నుంచి ఒంటరిగా ఉన్న వ్యక్తులపై కొండముచ్చు దాడి చేసి గాయపరుస్తుంది. ఐదుగురు కొండముచ్చు దాడిలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామస్తులు స్థానిక పంచాయతీ అధికారులు, అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం అటవీశాఖ అధికారులు కొండముచ్చును బోనులో బంధించారు. అటవీ ప్రాంతంలో వదిలి వేస్తామని వారు తెలిపారు.

కోడి పందాలు చూద్దామని తీసుకెళ్లి హత్య

● నిందితుడి అరెస్టు ● వివరాలు వెల్లడించిన పెద్దాపురం డీఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

ఏలేశ్వరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడిని ఏలేశ్వరం పోలీసులు పట్టుకున్నారని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. మంగళవారం ఏలేశ్వరంలో విలేకర్లకు ఈ వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో బొదిరెడ్డి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఈనెల 2న అదృశ్యమవ్వడంతో అతడి కుమారుడు ఆంజనేయులు 4న ఏలేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జిల్లా ఎస్పీ సూచనల మేరకు వెంకటేశ్వర్లు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న ఏలేశ్వరానికి చెందిన రాజా రమేష్ అడ్డతీగల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. చికిత్స అనంతరం కోలుకున్న అతడిని సోమవారం అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణ చేపట్టగా తానే వెంకటేశ్వర్లును హత్య చేసినట్టు రమేష్ ఒప్పుకున్నాడని డీఎస్పీ తెలిపారు. వారిద్దరికి కోడి పందాల్లో పరిచయం ఉంది. ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయి. ఈ క్రమంలోనే కోడి పందాలు చూద్దామనే సాకుతో వెంకటేశ్వర్లును రాజా రమేష్ కారులో తీసుకెళ్లి కూల్ డ్రింక్‌లో మత్తుమందు కలిపి ఇచ్చాడు. అపస్మారకస్థితికి వెళ్లిన వెంకటేశ్వర్లను హత్య చేసి ఏజెన్సీ ప్రాంతం కొయ్యూరు సమీపంలోని బోదరాళ్ల ఘాట్ వద్ద తుప్పల్లో పడేసి వచ్చాడు. రాజా రమేష్ వెంకటేశ్వర్లు వద్ద రూ.10 లక్షలు అప్పు తీసుకున్నాడు. బాకీ తీర్చమని ఒత్తిడి తేవడంతో అప్పు తీర్చే దారిలేక వెంకటేశ్వర్లను రాజా రమేష్ హత్య చేసినట్టు విచారణలో వెల్లడించాడని డీఎస్పీ పేర్కొన్నారు. వెంకటేశర్లు ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను తీసి ఏలేశ్వరంలో ప్రయివేటు బ్యాంకులో తాకట్టు పెట్టి రూ.3.5 లక్షలు తీసుకున్నాడని డీఎస్పీ తెలిపారు. రాజా రమేష్‌ను అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టుకు తరలించినట్టు తెలిపారు. కేసును చేధించడంలో ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు, ఏలేశ్వరం ఎస్‌ఐ రామలింగేశ్వరరావు,సిబ్బంది కృషిని ఎస్పీ అభినందించారు.

ఉద్యోగాల పేరుతో రూ.లక్షల్లో మోసం

కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరిపై కేసు

కోటనందూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో బొద్దవరం గ్రామానికి చెందిన మళ్ల మల్లేశ్వరరావు, తునికి చెందిన కనిరెడ్డి దుర్గారత్నం కేంద్రప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి సుమారు రూ.25లక్షలు వసూలు చేసి నకిలీ అపాయిమెంట్‌లెటర్‌లు ఇచ్చి చాలామందిని మోసం చేశారు. అందులో బొద్దవరం గ్రామానికి చెందిన గెద్దం ప్రేమ్‌కుమార్ నుంచి రూ.2.80 లక్షలు, ఎస్‌అర్‌పేట గ్రామానికి చెందిన రొబ్బిల రాజు నుంచి రూ.3.80 లక్షలు, నాతవరం మండలం ఎస్‌బి పట్నం గ్రామానికి చెందిన పొట్నూరి శివకుమార్ నుంచి రూ.4.30 లక్షలతో పాటు పలువురి నుంచి భారీగా వసూలు చేశారు. బాధితుల ఫిర్యాదుతో మల్లేశ్వరరావు, దుర్గారత్నంపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

14 రోజుల రిమాండ్ విధింపు

కె.గంగవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం పామర్రు గ్రామంలో దొంగతనం చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు పామర్రు ఎస్‌ఐ ఎస్‌కె. జానీబాషా తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పామర్రులోని దేవ రపల్లి సత్యవతి ఇంట్లో ఎవరూ లేని సమ యంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించి బంగారు ఉంగరం, ఇత్తడి సామన్లు చోరీ చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి తాళ్లపొలం గ్రామానికి చెందిన పప్పుల ప్రభుకుమార్ (22), ద్రాక్షారామం గ్రామానికి చెందిన కోదూరి వెంకటేష్‌ను నిందితులుగా గుర్తించారు. వారిని మంగళవారం రామచంద్రపురం మండలంలోని తాళ్లపొలం గ్రామ పరిధిలోని తాళ్లపొలం గృహకల్ప అపార్ట్‌మెంట్స్ వద్ద అరెస్టు చేశారు. రామచంద్రపురం కోర్టులో హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించారని ఎస్‌ఐ తెలిపారు. వారి నుంచి దొంగతనం చేసిన సొత్తు బంగారు ఉంగరం, ఇత్తడి బిందె (రూ.38,000), కరప పోలీస్‌స్టేషన్ పరిధిలో అరట్లకట్ట గ్రామంలో చోరీకి సంబంధించిన 12 గ్రాముల బంగారు గొలుసు (రూ.36,000)ను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

బావమరిది చనిపోయాడని వెళ్తుండగా..

లారీని మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి

మరొకరికి తీవ్రగాయాలు


మరణించిన దొడ్డి నాగు


ఫైల్

దేవరపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): లారీని మోటార్‌సైకిల్ ఢీకొని వ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలైన ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో జరిగింది. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామానికి చెందిన దొడ్డి నాగు (35) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విజయవాడలో తన బావమరిది చనిపోయాడని కబురు రావడంతో కొత్తపట్టిసీమ నుంచి తూర్పుగోదావరి కొవ్వూరు మండలం దొమ్మేరు వచ్చాడు. తన మేనమామ కుమారుడు తాళ్ల అభిషేక్‌తో మోటార్ సైకిల్‌పై మంగళవారం ఉదయం విజయవాడకు పయనమయ్యారు. ఎదురుగా వెళ్తున్న క్వారీ లారీ యర్నగూడెం శివారు గండిచెరువు వద్ద మలుపు తిప్పుతుండగా వెనుక నుంచి వేగంగా మోటార్‌సైకిల్ దూసుకెళ్లి ఢీకొనడంతో దొడ్డి నాగు (35) అక్కడికక్కడే మృతి చెందాడు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన తాళ్ల అభిషేక్‌కు కాలు విరగడంతో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. మృతుడు నాగుకు భార్య సీత, కుమార్తె రచిత, కొడుకు చరణ్ ఉన్నారు. నాగు మృతదేహాన్ని గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్‌ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కూలీ పనులకు వెళ్తుండగా..

లారీ ఢీకొని మహిళ మృతి


లారీ టైర్ల మధ్యలో మృతదేహం

కడియం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కడియపులకంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరితోటకు చెందిన కాదా గంగమ్మ (65) మరణించింది. పోలీసుల వివరాల ప్రకారం.. గంగమ్మ కడియపులంకలో కూలీ పనులకు మోటారుసైకిల్ లిఫ్టు అడిగి వెళ్తుండగా కడియపులంక వచ్చే సరికి పొట్టిలంక నుంచి కడియపులంక వైపు ఎదురుగా వస్తున్న లారీ గంగమ్మ ప్రయాణిస్తున్న మోటారుసైకిల్‌ను ఢీకొంది. దీంతో గంగమ్మ లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది. మోటారుసైకిల్ నడుపుతున్న వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. గంగమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ ధనలక్ష్మి కేసు నమోదు చేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం


ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి మంగళవారం ఒకదాత రూ.లక్ష యాభై ఒక్క రూపాయి విరాళం అంజేశారు. హైదరాబాద్‌కు చెందిన జి.శ్రీమన్నారాయణ లక్ష్మి దపంతులు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి స్వామి వారి ప్రసాదం, ప్రత్యేక దర్శనం కల్పించారు.

ధర్మవరంలో చోరీ

రూ.18 లక్షల విలువైన బంగారు, నగదు అపహరణ

ఆలస్యంగా వెలుగులోకి..

ప్రత్తిపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో రూ.18లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. గ్రామంలోని సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉంటున్న పలివెల లక్ష్మీనారాయణ గృహంలో జరిగిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం ప్రకారం... హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న తన కుమారుడు పలివెల సంతోష్ వద్దకు 10రోజుల కిందట లక్ష్మీనారాయణ దంపతులు ఇంటికి తాళం వేసి వెళ్లారు. 10 రోజుల పాటు కుమారుడు ఇంటి వద్ద గడిని మంగళవారం ధర్మవరం చేరుకున్న లక్ష్మీనారాయణ దంపతులు ఇంటి వద్ద తలుపుకు తాళం పగలకొట్టి దుండగులు చోరీకి పాల్పడినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గృహంలోని బీరువాలో భద్రపరిచిన బంగారు ఆభరణాలు, మరో రూ.2లక్షల నగదు, ఇతర వస్తువులు చోరీకి గురైనట్టు తెలిపారు. ఇటీవల గ్రామంలోనే హనుమాన్ కాలనీలో దుండగులు చొరబడి రూ.6లక్షలు విలువైన ఆభరణాలు దోచుకువెళ్లారు. ఇలా వరుసుగా గ్రామంలో దొంగతనాలు జరగడం పట్ల గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం పట్టివేత

గొల్లప్రోలులో 37.80 క్వింటాళ్లు స్వాధీనం

వాహనం సీజ్


గొల్లప్రోలులో స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం, వాహనంతో పోలీస్, సివిల్ సప్లైస్ అధికారులు

గొల్లప్రోలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్‌బియ్యాన్ని అక్రమ మార్గాల్లో తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో గొల్లప్రోలు అడిషనల్ ఎస్‌ఐ లక్ష్మణరావు, ఏలేశ్వరం సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ వీఆర్‌కేవీ ప్రసాద్, రెవెన్యూ అధికారులు శనివారం సాయంత్రం గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులోని బి.ప్రత్తిపాడు జంక్షన్ వద్ద తనిఖీలు చేపట్టారు. వ్యాన్‌లో రేషన్‌బియ్యాన్ని తరలిస్తుండగా గుర్తించారు. 80 బస్తాల్లో ఉన్న 37.80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ బి.ప్రత్తిపాడు గ్రామానికి చెందిన నందిపాటి వీరబాబును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యాన్ని పిఠాపురం ఎంఎల్ ఎస్ పాయింట్‌కు అప్పగించారు. సివిల్ సప్లైస్ డీటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అడిషనల్ ఎస్‌ఐ తెలిపారు. కాగా తరలిస్తున్న వ్యాన్‌కు ఎటువంటి నెంబరు ప్లేట్లు లేకపోవడం గమనార్హం.

రాజవొమ్మంగిలో 1600 కిలోలు..

రాజవొమ్మంగి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతం నుంచి మైదాన ప్రాంతానికి అక్రమంగా రవాణా అవుతున్న పీడీఎస్ బియ్యాన్ని రాజవొమ్మంగి తహశీల్దార్ అల్లు సత్యనారాయణ పట్టుకున్నారు. మండలంలోని లాగరాయి గ్రామం నుంచి కాకినాడ జిల్లాకు బియ్యం అక్రమ రవాణా అవుతుందనే సమాచారంతో తహశీల్దార్ సిబ్బందితో దాడి చేశారు. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలానికి చెందిన కోరుకొండ అచ్చిరాజు తన వ్యాన్‌లో 1600 కిలోల పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేయడం గుర్తించి సీజ్ చేశారు. వ్యాన్‌ను పోలీసుస్టేషన్‌కు, బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించారు.

శ్రమలేకపోవడంతో గుండెపోటు మరణాలు

కపిలేశ్వరపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శారీరక శ్రమలేకపోవడం వల్లే అనేక మంది గుండెపోటుకు గురవుతున్నారని వక్తలన్నారు. మంగళవారం అంగర పీహెచ్ వైద్యాధికారి రత్నకుమారి ఆధ్వర్యంలో సిద్దార్థ కాలేజీలో పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మల్లిఖార్జునుడు, బి.రామారావు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీపీవో

అంబాజీపేట, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య సిబ్బంది ద్వారా గ్రామాల్లో తడి చెత్త, పొడిచెత్తను సేకరించి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతాలక్ష్మి అన్నారు. గంగలకుర్రుఅగ్రహారంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. తడి, పొడిచెత్త వేసుకునేందుకు ప్రతి ఇంటికి ప్లాస్టిక్ డబ్బాలను అందించామన్నారు. డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సీహెచ్‌డీ మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోపణలపై సీబీఐ విచారణకు సిద్ధమా: మల్లాడి

● ఎంపీ వైద్యలింగానికి సవాల్





పుదుచ్చేరి ఎంపీ వైద్యలింగం, పుదుచ్చేరి ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత లోక్‌సభ ఎంపీ, మాజీ ముఖ్యమంత్రి వి.వైద్యలింగం ఇటీవల ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావుపై అవినీతి ఆరోపణలు చేశారు. మంగళవారం వైద్యలింగం ఇటీవల విడుదల చేసిన వీడియో విమర్శలపై మల్లాడి ఘాటుగా స్పందించారు. ఎంపీ వైద్యలింగం అవినీతిపై సంచలన విమర్శలు చేశారు. ఆరోపణలపై సీబీఐ విచారణకు నేను సిద్ధం, మీరు సిద్ధమేనా అని మల్లాడి ప్రశ్నించారు. యానాం-ఎదుర్లంక వారధి శంకుస్థాపన ఎన్నికల కోడ్ వల్ల మీటైమ్‌లో ఆగిపోయిందన్నారు. తర్వాత డీఎంకే కూటమి ప్రభుత్వ హయాంలో నేను ఎమ్మెల్యే అయిన తర్వాత శంకుస్థాపన జరిగిందన్నారు. నేను రెవెన్యూ మంత్రిగా ఉన్నప్పుడు పేపర్‌మిల్లుకు సంబంధించి తప్పు చేయమని మీరు చెప్పారు, కానీ నేను ఆ పని చేయలేదన్నారు. అయితే ఆ పనిని మీరు వేరేవిధంగా చేయించడంతో దీనిపై సీబీఐ విచారణ చేపట్టిందన్నారు.

ఈవిషయంలో చెన్నై సీబీఐ విచారణకు మీరు వెళ్లారు. ఆవిషయంలో సబ్‌రిజిస్ట్రార్ వెంకటేషన్ సస్పెండ్ అయ్యారని గుర్తుచేశారు. నేను మంత్రిగా క్లీన్‌గా ఉన్నాను కాబట్టే నన్ను సీబీఐ పిలవలేదని తెలిపారు. 2008నుంచి 2011వరకు ఎక్సైజ్ మంత్రిగా ఉన్నప్పుడు డిస్టిలరీ నుంచి వచ్చే ముడుపులు తిరస్కరిస్తే, తనను పెన్సిల్‌తో సంతకం పెట్టి మార్క్ చేయమని చెప్పిన విషయం నిజం కాదా అని వైద్య లింగాన్ని మల్లాడి ప్రశ్నించారు. లక్షలోపు జనాభా ఉన్న మున్సిపాల్టీలకు అమృత్ స్కీం అర్హత లేదంటే అప్పటి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుతో మాట్లాడి చేసిన ప్రయత్నం వల్ల కేంద్రనుంచి రూ.9కోట్లతో 5ఎంఎల్‌డీ ప్లాంట్ యానానికి వచ్చిందన్నారు. దేశంలో అనేక చిన్న మున్సిపాల్టీలకు లాభం జరిగిందని, దీనిలో ఎంపీగా మీ పాత్ర ఏమైనా ఉందా అని మల్లాడి ప్రశ్నించారు. ఎక్సైజ్ శాఖ, ప్రజాపనులశాఖ పనుల్లో మీరు తీసుకున్న కమీషన్ల గురించి సీబీఐ విచారణ డిమాండ్ చేస్తూ నేను లెటర్ రాస్తానని మల్లాడి అన్నారు. నాపై కూడా సీబీఐ విచారణకు మీరు లెటర్ రాస్తారా అని మల్లాడి ప్రశ్నించారు. సీబీఐ విచారణ అంటే భయమైతే పాండిచ్చేరిలో వినాయకుడి గుడిలో ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు.

మత మార్పిడితో చరిత్ర సృష్టించిన అంబేడ్కర్



అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో సూర్యారావు, డీఎస్పీ ప్రసాద్ తదితరులు

అమలాపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): లక్షలాది మందితో ఒకే రోజున సామూహిక మత మార్పిడితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చరిత్ర సృష్టించారని అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్ వ్యవస్థాపకుడు గొల్లపల్లి సూర్యారావు తెలిపారు. త్రిరత్న బుద్ధ విహార్‌లో మంగళవారం పాలకమండలి ఆధ్వర్యంలో అంబేడ్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించిన రోజును పురస్కరించుకుని త్రిసరణ పారాయణం, పంచశీల, అష్టాంగ మార్గాలను పఠించారు. తొలుత బౌద్ధ ఉపాకులకు బౌద్ధ ధర్మాన్ని వివరించారు. సాంకేతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సూర్యారావుతో పాటు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ బుద్ధుని బోధనలతోనే ప్రపంచ శాంతి వర్ధిల్లుతుందన్నారు. 1956అక్టోబరు 14న నాగపూర్‌లో వందలాది మందితో అంబేడ్కర్ హిందూ మతాన్ని వీడి బౌద్ధ మతాన్ని స్వీకరించడానికి దారితీసిన పరిస్థితులను సెక్రటరీ జనరల్ డీబీ లోక్ వివరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, బుద్ధవిహార్ చైర్మన్ నాగాబత్తుల ప్రసాదరావు, బౌద్ధ ఉపాసకులు దోనిపాటి నాగేశ్వరరావు, కోడూరి రామమూర్తి, ఉండ్రు శ్యామలరావు, పెనుమాల చిట్టిబాబు, ములపర్తి సత్యానారాయణ, కాశి రాంబోధి, కడిమి చిన్నంరాజు, జంగా రాజేంద్రకుమార్, జల్లి శ్రీనివాస్, గోసంగి సంపదరావు, రేవు ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ బుద్ధిస్ట్ పిల్లి రాంబాబు రచించిన బౌద్ధధర్మ పుస్తకాలను సూర్యారావు ఆవిష్కరించి డీఎస్పీకి అందజేశారు.

'అక్షరాంధ్ర ఉల్లాస్'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి విజయభాస్కర్

ముమ్మిడివరం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యతను నిర్మూలించి సంపూర్ణ అక్షరాస్యతను సాధించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అక్షరాంధ్ర-ఉల్లాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నోడల్ అధికారి విజయభాస్కర్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో మెప్మా సిటీమిషన్ మేనేజర్ ఎస్.భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన అక్షరాంధ్ర-ఉల్లాస్ వలంటీరు శిక్షణ కార్యక్రమానికి విజయభాస్కర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. వయోజన విద్య ద్వారా గుర్తించిన స్లమ్ ఏరియాల్లోని నిరక్షరాస్యులకు వలంటీర్ టీచర్ల ద్వారా శిక్షణ ఇచ్చి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన బృహత్తర కార్యక్రమమన్నారు. డ్వాక్రా సంఘ సభ్యుల నుంచి విద్యావంతులైన 2003మందిని వలంటీరు టీచర్లగా ఎంపికచేసి వీరికి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వయోజనులకు విద్యాబోధనలో వారు సులువుగా గుర్తు పెట్టుకునేలా అర్థమయ్యే విధంగా విద్యాబోధన సాగించి వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. విద్యాబోధనకు సంబంధించి 14రకాల స్టడీ మెటీరియల్‌ను అందించారు. అలాగే గైడ్ పుస్తకాలను, వర్క్ పుస్తకాలను పంపిణీ చేశారు. నగర పంచాయతీ కమిషనర్ టి.రవివర్మ, వలంటీర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఎస్సీ నాయకులకే ఇన్‌చార్జి ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్సీ టీడీపీ నాయకులు

పి.గన్నవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ఎస్సీ నాయకులను అధిష్ఠానం గుర్తించాలని టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జాలెం సుబ్బారావు డిమాండ్ చేశారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిని స్థానిక ఎస్సీ నాయకులకే కేటాయించాలని కోరుతూ మంగళవారం త్రీరోడ్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. వైసీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి వచ్చే నాయకులకు పదవులు కేటాయించవద్దని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కోరుతున్నట్లు ఆయన వివరించారు. పి.గన్నవరం సర్పంచ్ బొండాడ నాగమణి మాట్లాడుతూ కొన్ని ఏళ్లుగా ఇన్‌చార్జి లేకపోయినా స్వంత ఖర్చులతో ఎన్నో కార్యక్రమాలు చేశామన్నారు. తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో చుట్టుగుళ్ల కిషోర్, పెదపూడి శ్రీను, కేదాశి చిన్న, పైడి బుజ్జి, ఆకుమర్తి ఆశీర్వాదం, ఉండ్రాజవరపు ప్రకాశరావు, గోగి నాగరాజు, ఉండ్రాజవరపు దాసు, పుచ్చకాయల అశోక్, పెదపూడి రాము, మంద రాజేష్, కత్తుల బాబు పాల్గొన్నారు.

ఘనంగా బౌద్ధ వందనం



యానాం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): యానాం త్రిరత్న ధమ్మదీక్షబౌద్ధ అసోసియేషన్, అంబేడ్కర్‌నగర్ సంక్షేమ సంఘం సంయుక్త నిర్వహణలో స్థానిక పాతబస్టాండ్ వద్ద బౌద్ధ వందనం కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఉన్న బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం అంబేడ్కర్‌నగర్ బుద్ధా పార్కులో బుద్ధుని విగ్రహం వద్ద బౌద్ధ వందనాలతో పూజా కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ సంక్షేమ సంఘం త్రిరత్న బౌద్ధ ధమ్మ సొసైటీ అధ్యక్షుడు గుర్రపు ప్రహ్లాదుడు, కార్యదర్శి నామడి అప్పారావు, పొనుగుమట్ల విష్ణుమూర్తి, గిడ్డి బలరాం, యాళ్ల వెంకట్ కుమార్, కోరుకొండ రాజేంద్రప్రసాద్, మీరా సాహెబ్, మట్ల శ్రీను పాల్గొన్నారు.

ఆక్రమణలపై ఫిర్యాదు



అంతర్వేది, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గుడిమూల గ్రామంలో పుష్కరరేవు, శ్మశానవాటిక ఆక్రమణలకు గురైందని తహశీల్దార్ గ్రీవెన్స్‌లో మంగళవారం తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావుకు స్థానికులు ఫిర్యాదు చేశారు. గుడిమూలలో ఏటిగట్టు పుష్కరరేవుకు, శ్మశానవాటికకు వెళ్లే రహదారికి ఇరువైపులా ఆక్రమణలకు గురైందన్నారు. పుష్కరరేవులో కొంత స్థలాన్ని ఆక్రమించారన్నారు. కందుల సూర్యచంద్రరావు, గుబ్బల పెద్దిరాజు, మన్నే వెంకన్న, స్థానికులు పాల్గొన్నారు.

గోతులతో అధ్వానంగా రామేశ్వరం రోడ్డు





ఎన్.రామేశ్వరం వెళ్లే డ్రెయిన్ గట్టు రోడ్డులో భారీగా గోతులు, ఎన్.రామేశ్వరం రోడ్డులో అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద ప్రమాద భరితంగా ఇరుకురోడ్డు

అల్లవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం శివారు ఎన్.రామేశ్వరం మత్స్యకార దీవికి వెళ్లే రోడ్డు అడుగడుగునా గోతులతో అధ్వానంగా తయారైంది. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోక గోతులు పడి ప్రమాద భరితంగా మారింది. నిత్యం హేచరీలకు ఉప్పునీటిని తరలించే మినీ లారీలు ఇతర వాహనాలతో గోతులు పడి ప్రమాదాలకు నిలయమైంది. వందలాదిగా మోటారు సైకిళ్లపై ఆక్వారైతులు, మత్స్యకారులు గోతులు పడి పాడైనా ఆ రోడ్డుపైనే వెళ్లాల్సి వస్తుంది. కొమరగిరిపట్నం శివారు శిథిల అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద రోడ్డు కుచించుకుపోయి ప్రమాదభరితంగా తయారైంది. చల్లపల్లి నుంచి వాసాలతిప్ప వెళ్లే రోడ్డు పాడై ఇబ్బందులు పడుతున్నారు. రామేశ్వరం నుంచి కొమరగిరిపట్నం వెళ్లే పంచనది డ్రెయిన్ గట్టు రోడ్డు పూర్తిగాపాడై వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారులు పూర్తిగా పాడైన రామేశ్వరం రోడ్డు దుస్థితిని పట్టించుకోవడం లేదని మత్స్యకారులు, రైతులు ఆరోపిస్తున్నారు. గోతులు పడి దెబ్బతిన్న రామేశ్వరం-కొమరగిరిపట్నం వెళ్లే రోడ్డును అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జడ్పీ ఉన్నత పాఠశాల అదనపు భవనానికి రూ.13లక్షలు



ఎమ్మెల్యే ఆనందరావుకు వినతిపత్రం అందజేస్తున్న శంకరమూర్తి తదితరులు

అమలాపురంరూరల్, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన మెగా వైడ్ ప్రైవేటు కంపెనీ లిమిటెడ్ బండారులంక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.30లక్షలు మంజూరుచేసింది. గ్రామానికి చెందిన దాత పేరి శ్రీనివాసశర్మ కృషి ఫలితంగా ఈనిధులు మంజూరయ్యాయి. ఈవిషయాన్ని మంగళవారం టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్ ఆధ్వర్యంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, సర్పంచ్ పెనుమాల సునీతలు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దృష్టికి తీసుకువెళ్లారు. అదనపు భవన నిర్మాణాలకు రూ.43లక్షలతో అంచనాలు వేశామని, ప్రైవేటు కంపెనీ దాత రూ.30లక్షలు మంజూరు చేసిన విషయాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. మిగిలిన రూ.13 లక్షలు తాను మంజూరు చేస్తానని, తక్షణం పనులు ప్రారంభించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రూ.13లక్షలు మంజూరుచేసిన ఎమ్మెల్యేను అభినందించారు. గ్రామ కార్యదర్శి కోరుమిల్లి శ్రీనివాస్, పెనుమాల ఏడుకొండలు ఉన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



రవికుమార్‌కు మద్దతు ఇస్తున్న అంబేడ్కర్ యువజన సంఘ నాయకులు

ముమ్మిడివరం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో బస్టాండును వెంటనే పునరుద్ధరించి ప్రజలకు అవసరమయ్యే సౌకర్యాలను కల్పించాలని కోరుతూ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్ష మంగళవారం కూడా కొనసాగింది. దీక్షా శిబిరాన్ని అయినాపురం అంబేడ్కర్ యువజన సంఘ నాయకులు బరకట వరప్రసాద్, నీలం చినబాబు, యడ్ల చిట్టిబాబు, బడుగు రాంబాబు, గూటం నానాజీ, కన్నీడి వెంకటరమణ, మెండి దుర్గాప్రసాద్, జంగా నాగేశ్వరరావు, కాశి మూర్తి, జనిపల్లి వెంకటేశ్వరరావు, బీర బాలకృష్ణ, దళిత నాయకులు మెండి కృష్ణబాబు సందర్శించి సంఘీభావం తెలిపారు. బస్టాండును వెంటనే పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.

శంకరగుప్తం రైతులను ఆదుకోవాలి

మలికిపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం డ్రెయిన్ ఉప్పునీటి వల్ల నష్టపోయిన రైతులను ఆదుకుని కొబ్బరి చెట్లు కోల్పోయిన రైతుకు ఒక్కో చెట్టుకు రూ.10వేలు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. మంగళవారం కేశనపల్లిలో సీపీఎం పార్టీ బృందం కేశనపల్లి, శంకరగుప్తం డ్రెయిన్‌ను, నష్టపోయిన ప్రాంతాలను పరిశీలించారు. రైతులను ఆదుకోవాలని నిపుణుల కమిటీని ఈ ప్రాంతానికి పంపి సమగ్ర సర్వే చేయాలని కోరారు. కె.వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్, శ్రీరామమూర్తి, సూర్యప్రకాష్, సాయిబాబు, కారుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీఎస్టీతో భవన నిర్మాణదారులకు ఊరట

పి.గన్నవరం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో భవన నిర్మాణదారులకు ఖర్చులో పది శాతం తగ్గిందని అంబాజీపేట జీఎస్టీవో సీహెచ్‌వీఆర్‌కే శాస్త్రి అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బిల్డింగ్ మెటీరియల్‌పై తగ్గిన జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. గతంలో సిమెంట్, మార్బుల్, గ్రానైట్ ఫ్లోరింగ్, ఇసుక, సున్నం ఇటుకలు, వెదరు ఫ్లోరింగ్ తదితర వస్తువులపై పదిశాతం జీఎస్టీ తగ్గిందన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ఒక చిన్నపాటి బిల్డింగ్ నిర్మాణంలో రూ.52,600 ఖర్చు ఆదా అవుతుందన్నారు. అనంతరం స్థానిక బిల్డింగ్ మెటీరియల్ షాపు వద్ద తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.మల్లికార్జునరావు, ఏవో శర్మ, జీఎస్టీవో కె.సాయిరెడ్డి, జీఎస్టీ ఏఈవో కె.బాబ్జి, ఈటీఏ జి.రాజేష్, పంచాయతీ కార్యదర్శి పిల్లి శ్రీను, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బృందం ఉపాధి పనుల పరిశీలన



బోడసకుర్రులో ఉపాధి పనులు పరిశీలించిన కేంద్ర బృందం ప్రతినిధులు

అల్లవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రు పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులను కేంద్ర బృందం ప్రతినిధులు మయూర్‌వర్మ, ఉమేష్‌కుమార్‌రామ్ మంగళవారం పరిశీలించారు. ఉపాధి కూలీల ద్వారా చేపట్టిన పశువుల షెడ్డు, 90రోజులు గృహనిర్మాణ పనులు, వైనతేయ వరద గట్టును కేంద్ర బృందం పరిశీలించింది. ఉపాధి ఏపీడీ, మండల ప్రత్యేకాధికారి డి.రాంబాబు, ఎంపీడీవో గౌరీకుమారి, ఏపీవో రాజామణి, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో యు.నాగేంద్ర, పంచాయతీ కార్యదర్శి బి.ఆదిశంకరరావు, ఉపసర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, ఫీల్డు అసిస్టెంట్ బొంతు శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ఐసీఎంఆర్ రీసెర్చ్‌కు కిమ్స్ నుంచి పది ప్రాజెక్టులు ఎంపిక

అమలాపురం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా వైద్య కళాశాలల పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)కు వేలాదిగా ఈఏడాది ప్రాజెక్టులు రూపొందించి అందించారు. వాటి నుంచి అత్యుత్తమమైన 454 రీసెర్చ్ ప్రాజెక్టులను ఐసీఎంఆర్ ఎంపిక చేసింది. అందులో అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల పీజీ విద్యార్థులు రూపొందించిన పది ప్రాజెక్టులు ఉండడం విశేషమని కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య తెలిపారు. కిమ్స్ వైద్య కళాశాలకు చెందిన ఈఎన్‌టీ విభాగ పీజీ విద్యార్థి డాక్టర్ కె.విద్యాసాగర్, ప్రసూతి, స్త్రీరోగ చికిత్సా విభాగ పీజీ విద్యార్థులు డాక్టర్ ఆర్ల సాహితీ, డాక్టర్ ఎంవీ జ్యోతిర్మయి, డాక్టర్ వల్లూరు శ్రీలేఖ, డాక్టర్ ఎస్.లిఖితాంజలి, డాక్టర్ ఎడా అలేఖ్య, డాక్టర్ కోటిపల్లి సత్యదేవిక, డాక్టర్ పెరుగు నవ్యశ్రీ, డాక్టర్ వర్ధన పు యామినీ, డాక్టర్ కాటంశెట్టి గీతిక ఉన్నారు. వీరంతా రూపొందించిన ప్రాజెక్టులు ఐసీఎంఆర్‌కు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఐసీఎంఆర్ ప్రతీ ఏటా పీజీ విద్యార్థుల రీసెర్చ్ ప్రాజెక్టులను ఎంపికచేసి ప్రతీ ప్రాజెక్టుకు రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం అందిస్తుందన్నారు. తమ కళాశాలకు చెందిన పది మంది విద్యార్థులు రూ.లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహం కూడా పొందనున్నారని డాక్టర్ ఆనంద్‌ఆచార్య తెలిపారు. ఐసీఎంఆర్ ప్రోత్సాహకాలకు ఎంపికయ్యేలా విద్యార్థులకు మార్గదర్శనం చేసిన సంబంధిత విభాగాధిపతులు, అధ్యాపక బృందాన్ని కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ, డాక్టర్ ఆనంద్‌ఆచార్యలు తదితరులు అభినందించారు.

'సీబీఐతో విచారణ చేయించాలి'

మండపేట, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యం ఘటనపై సీబీఐ విచారణ నిర్వహించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. మంగళవారం ఆయన స్థానిక ఆ పార్టీ శ్రేణులతో కలిసి బైక్‌ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ తేజేశ్వరరావుకు వారు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నూకదుర్గారాణి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అసమానతలకు వ్యతిరేకంగా బౌద్ధ మతం స్వీకరణ

ముమ్మిడివరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధ మతం స్వీకరించిన రోజును ముమ్మిడివరంలో అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, ఇతర అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలమ్మ చెరువుగట్టున ఉన్న జైబుద్ధ పార్కులో బుద్ధుని విగ్రహం వద్ద బౌద్ధ వందనం చేశారు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంప్రదాయ ఆచారాలు, అసమానతలకు వ్యతిరేకంగా అంబేడ్కర్ బౌద్ధమతం స్వీకరించారన్నారు. వడ్డి నాగేశ్వరరావు, బాబూజగ్జీవన్‌రావు, దోనిపాటి ఆంజనేయులు, బీర ప్రసాద్ పాల్గొన్నారు.

పంట పొలాలను రక్షించాలంటూ ఎమ్మెల్యేకు వినతి



సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న పాశర్లపూడిలంక రైతులు

మామిడికుదురు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలంకలోని తమ పొంట పొలాలను రక్షించాలంటూ ఎమ్మెల్యేను పాశర్లపూడిలంక రైతులు కోరారు. మంగళవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణను కలుసుకుని వినతిపత్రం అందజేశారు. నగరం నుంచి తమ గ్రామానికి వచ్చే డ్రెయిన్ వల్ల వచ్చే వ్యర్థాలు, ఓఎన్జీసీ నిర్మించిన రోడ్ల వల్ల వరిచేలు పూర్తిగా పాడైపోతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. కోనసీమ పర్యటనకు వస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను తమ ప్రాంతానికి తీసుకువచ్చి తమ పరిస్థితిని ఆయనకు తెలిసేలా చూడాలని రైతులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో కోలా సత్తిబాబు, జీవీఎస్ మూర్తి, మేడిద ఆదినారాయణ, సీహెచ్ సత్తిబాబు, టి.నాగేంద్ర, టీఎస్వీ రావు, తదితరులు ఉన్నారు.

లైసెన్సులేని బాణసంచా దుకాణాలు సీజ్ చేస్తాం

అంబాజీపేట, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే, బాణసంచాను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహశీల్దారు చినబాబు హెచ్చరించారు. దుకాణదారులు తాత్కాలిక లైసెన్సులు తీసుకుని అధికారులు సూచించిన స్థలాల్లో విక్రయించుకోవాలని సూచించారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు, ముక్కామల హైస్కూల్ క్రీడామైదానాలను పరిశీలించారు. దుకాణదారులు రెవెన్యూ, పోలీస్, ఫైర్,సేల్‌ట్యాక్స్, పంచాయతీల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. ఆర్ఐ ఏడుకొండలు, వీఆర్వోలు జీవీ రమణ, జి.వెంకటేశ్వరరావు, ఐవీ రమేష్ పాల్గొన్నారు.

సర్వీసు రిజిష్టర్ల అందజేత

కె.గంగవరం, అక్టోబరు 14(ఆంధ్ర జ్యోతి): మెగా డీఎస్సీ2025 ద్వారా మండలంలో విధుల్లో చేరిన 23మంది ఉపాధ్యాయులకు మంగళవారం పీఆర్‌టీయూ సంఘం సర్వీసు రిజిష్టర్లను అందజేసింది. ఈపుస్తకం వారి జీవితాంతం ఉపయోగ పడుతుందని పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఓదూరి వెంకటరమణ అన్నారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఢమరుకనాదం, నాయకులు డి.లోవరాజు, నేదునూరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ మేళా ప్రారంభం



షాపింగ్ మేళాను ప్రారంభించిన డిప్యూటీ కమిషనర్ రవికాంత్

అమలాపురం టౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా మంగళవారం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్, గోల్డ్ మార్కెట్ అసోసియేషన్ భవనంలో షాపింగ్ మేళాను మంగళవారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ సేల్స్ ట్యాక్స్, జిల్లా నోడల్ అధికారి చెక్కా రవికాంత్ ప్రారంభించారు. ఈనెల18 వరకు షాపింగ్ మేళాను నిర్వహిస్తామన్నారు. అనంతరం పరిసర గ్రామస్తులంతా స్టాల్స్‌ను సందర్శించి జీఎస్టీ తగ్గింపు పొందిన వస్తువులను ప్రత్యక్షంగా దర్శించి తగ్గింపు ఫలాలను ప్రజలందరికీ తెలియచేయాలని రవికాంత్ సూచించారు. కార్యక్రమంలో సీటీవో జగన్మోహన్‌రెడ్డి, ఏసీటీవో యిళ్ల భక్తవత్సలం, ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, అసోసియేషన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, ముఖ్య సలహాదారు కంచిపల్లి అబ్బులు, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, గోల్డ్ మార్కెట్ అధ్యక్షుడు మేడిచర్ల త్రిమూర్తులు, మాజీ అధ్యక్షుడు వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరరావు, సప్పా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీతో కాంట్రాక్టర్లకు మేలు..

సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌తో బిల్డర్స్, కాంట్రాక్టర్లకు ఎంతో మేలు చేకూరుతుందని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం బిల్డర్స్, కాంట్రాక్టర్లతో కమిషనర్ చాంబర్‌లో జీఎస్టీ 2.0 అవగాహన సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి రూ.8వేల కోట్ల ఆదాయం జీఎస్టీ వల్ల తగ్గుతుందని, ఆ మేరకు ప్రజలు లబ్ధి పొందుతున్నారని వివరించారు. సమావేశంలో బిల్డర్స్ అండ్ రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు ఎంఎన్‌వీ ప్రసాద్, సుంకర నాయుడు, కొత్తూరి శ్రీను, ముద్రగడ కాసు, రేకపల్లి సోము, యెరుబండి నాని, అరిగెల బుజ్జి, మోపూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలని కాంట్రాక్టు కార్మికుల వినతి

మలికిపురం, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో దశాబ్దాల తరబడి పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని పంచాయతీ కాంట్రాక్టు కార్మికులు కోరారు. మంగళవారం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఏళ్ల తరబడి పనిచేస్తూ చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. పంచాయతీల్లో పన్నుల వసూళ్లు, నాన్‌ట్యాక్సుల వసూళ్లు తదితర కార్యాలయ పనులు చేస్తున్నట్టు తెలిపారు. జిల్లా మొత్తం రూ.1250మంది ఉన్నామని, రాష్ట్ర ప్రభుత్వం మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. జీసీహెచ్ఎస్ నారాయణ మూర్తి, ఎం.వెంకయ్యనాయుడు, కె.ప్రసాద్, భైరవస్వామి పాల్గొన్నారు.

'ప్రత్యేక హోదా ఏమైంది'

మండపేట, అక్టోబరు 14(ఆంధ్ర జ్యోతి): కేంద్రం ఇచ్చిన విభజన హామీకి 12ఏళ్ల పూర్తయినా అమలుకు నోచుకోలేదని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. ప్రత్యేక హోదాను కేంద్రం మరిచిపోయిందన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడారు.

మాజీ ఎంపీటీసీ నరసింహమూర్తి మృతి



ఉప్పలగుప్తం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గోపవరం మాజీ ఎంపీటీసీ అయినవిల్లి నరసింహమూర్తి(85) సోమవారం రాత్రి మృతి చెందారు. 2006-11లో ఆయన టీడీపీ తరపున ఎంపీటీసీగా పనిచేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. కల్లుగీత కార్మిక సొసైటీ అధ్యక్షుడిగా కార్మికుల సంక్షేమానికి కృషి చేశారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అగ్రిమిషన్ డైరెక్టర్ అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు, మాజీ సర్పంచ్ అయితాబత్తుల వెంకటకృష్ణారావు, నీటి సంఘం చైర్మన్ ఆకుల వెంకటరమణ, తెలుగురైతు అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ, పలువురు జనసేన నాయకులు సంతాపం తెలిపారు.

లాకుల వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

అమలాపురం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నడిపూడి లాకులను దాటుకుని ఈదరపల్లి వంతెన వైపు కొట్టుకు వస్తున్న గుర్తుతెలియని మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. నడిపూడి బైపాస్ రోడ్డులోని బాబూజగ్జీవన్‌రామ్ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న ప్రధాన పంటకాల్వ తుప్పల్లో మృతదేహం చిక్కుకుపోయింది. మూడు రోజులుగా అక్కడే ఉండిపోవడం వల్ల దుర్వాసన వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఈవిషయాన్ని తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.

సొసైటీ మాజీ చైర్మన్ తులసీరావుకు సతీ వియోగం



కాట్రేనికోన, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఉప్పూడి సొసైటీ మాజీ చైర్మన్ రంభాల తులసీరావు భార్య పార్వతి(74) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. తులసీరావు టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి విధేయుడుగా ఉన్నారు. పార్వతి మృతికి ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, టీడీపీ మండలాధ్యక్షుడు చెల్లి సురేష్, సర్పంచ్ రంభాల రమేష్, ఎంపీటీసీ ర్యాలి వీరబాబు, జనసేన అధ్యక్షుడు రంభాల చౌదరిబాబు, నడింపల్లి సుబ్బరాజు, పీఎస్ఎన్ రాజు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, ఆకాశం శ్రీను, బండారు ఏసు, ర్యాలి బద్రి విచారం వ్యక్తం చేశారు.

భీమేశ్వరాలయంలో విశ్రాంత సీజే ఎన్వీ రమణ పూజలు

ద్రాక్షారామ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని మంగళవారం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఎన్వీ రమణ సతీసమేతంగా సందర్శించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలోని వాయు లింగానికి స్వయంగా ఆయన అభిషేకం చేశారు. వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు.

తిరుమల తరహాలో వాడపల్లి ఆలయ అభివృద్ధి

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుమల తరహాలో వాడపల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం ఆయన కుటుంబ సమేతంగా బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారికి పూజలు జరిపారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్టు తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషికి స్వామివారి అనుగ్రహం తోడుకావాలని కోరుకున్నానన్నారు. ఇక్కడికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పారిశుధ్యం, టాయిలెట్స్‌ చంటి పిల్లల తల్లులకు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు, ఉచిత దర్శనాలు, ఉచిత ప్రసాదాలు, స్లాట్‌ విధానం, త్వరగా భక్తులకు దర్శనం జరిగేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణం త్వరితగతిన నిర్మించి కోనేరును అందుబాటులోకి తెస్తామన్నారు. వాడపల్లికి వచ్చే అన్ని రహదారులను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్న చైర్మన్‌ వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావులను ఎమ్మెల్యే అభినందించారు.

సమస్య పరిష్కారంపై రిక్షా కార్మికుల హర్షం

మండపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్‌ వద్ద వున్న రిక్షా కార్మికుల షెడ్డును మున్సిపల్‌ అధికారులు స్వాధీనం చేసుకోవడంపై వారు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్లను వారు కలిసి తమ గోడును వినిపించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఈ వ్యవహారంపై మున్సిపల్‌ కమిషనర్‌తో ఫోన్‌లో ప్రశ్నించారు. కార్మికులు మాట్లాడుతూ రిక్షాస్టాండ్‌ విషయంలో తమను కొంత మంది పక్కదారి పట్టిస్తున్నారని తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. రిక్షాస్టాండ్‌ విషయంలో జోక్యం చేసుకోవద్దని కమిషనర్‌ను ఆయన ఆదేశించారు. దీంతో రిక్షా కార్మికులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ చుండ్రు శ్రీవరప్రకాష్‌, మాదిగ కార్పొరేషన్‌ రాష్ట్ర డైరెక్టర్‌ మందపల్లి చంద్రశేఖర్‌, ఎంఆర్‌పీఎస్‌ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బుంగ సంజయ్‌, మున్సిపల్‌ కౌన్సిలర్‌ సరవపు సతీష్‌, టీడీపీ నాయకుడు ఇజ్రాయిల్‌, రిక్షా కార్మికులు పాల్గొన్నారు.

వైద్య సదుపాయాలపై విచారణ

కపిలేశ్వరపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వడ్లమూరు గ్రామంలోని హెల్త్‌ వెల్‌నెస్‌ సెంటర్‌, ఆయుష్మాన్‌ ఆరోగ్య మందిరం వద్ద మంగళవారం వైద్య సదుపాయాలపై ఎన్‌క్యూఏఎస్‌ (నేషనల్‌ క్వాలిటీ అష్యూరెన్స్‌ స్టాండర్డ్స్‌) టీం విచారణ జరిపారు. ఈ సందర్భంగా డాక్టర్‌ అకిలాన్‌ ఆర్డీ, డాక్టర్‌ రోషన్‌ ఆండ్రు నజరిత్‌ లు, డిస్ట్రిక్ట్‌ క్వాలిటీ కన్సల్‌టెంట్‌ కె.సునీత వర్చువల్‌గా వైద్య ఆరోగ్య రంగంలో అందిస్తున్న 12 రకాల వైద్యసేవలపై ఆన్‌లైన్‌ విచారణ చేశారు. పబ్లిక్‌ నుంచి ఈ సేవలు అందించడంపై అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సహాయం, సదుపాయం అందించేందుకు వారు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సీహెచ్‌ గోపాలకృష్ణ, వడ్లమూరు ఎంఎల్‌హెచ్‌పీ వరలక్ష్మి, ఏఎన్‌ఎం సుబ్బయ్యమ్మ, హెల్త్‌ అసిస్టెంట్‌ రాంబాబు, ఆశాలు మీరమ్మ, నాగలక్ష్మి, చంద్రకుమారి, శిరీష, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.


వడ్లమూరులో వర్చువల్‌ విచారణ చేస్తున్న దృశ్యం

గూగుల్‌ రాక రాష్ట్ర చరిత్రలో మైలురాయి

కొత్తపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): విశాఖకు గూగుల్‌ రాక రాష్ట్ర చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం వాడపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విశాఖలో భూదందాలు, అక్రమాలు ఎక్కువయ్యాయని ఆరోపించారు. ఇప్పుడు విశాఖపట్టణం ఏఐ, డిజిటల్‌ సిటీగా రూపొందుతున్నదని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు ముత్యాల బాబ్జి, గనిశెట్టి వీరేష్‌, బూసి భాస్కరరావు, ధరణాల రామకృష్ణ, యల్లమిల్లి జగన్మోహన్‌, రెడ్డి రామకృష్ణ, బూసి విష్ణు, పల్లి ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ హబ్‌గా విశాఖపట్టణం

మండపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనకబడి ధ్వంసం అయిందని వక్తలు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో రాష్ట్రం ఐటీ హబ్‌గా మారిందని ఎమ్మెల్యే వేగుళ్ల అన్నారు. మండపేటలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఐటీ సంస్థలు అమరావతి, విశాఖకు తరలి వచ్చాయన్నారు. విశాఖలో ఐటీతోపాటు ఏఐ కూడా రావడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు కృషి ఫలితమే తెలంగాణలో ఐటీ రంగం రావడానికి కారణమని వేగుళ్ల గుర్తు చేశారు. విశాఖలో గూగుల్‌ రాకవల్ల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ ఉంటుందని ఆయన అన్నారు.


రావులపాలెంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎంవో రాంబాబు

23 నుంచి స్కౌట్‌ టీచర్లకు శిక్షణ

రావులపాలెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు భారత్‌ స్కౌట్‌ అండ్‌ టీచర్స్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు సమగ్రశిక్ష ఏఎంవో, స్కౌట్‌ అండ్‌ గైడ్స్‌ జిల్లా కార్యదర్శి పి.రాంబాబు తెలిపారు. శిక్షణ కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సెల్ఫ్‌ అసెస్మెంట్‌-2 పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఏఎంవో రాంబాబు మాట్లాడుతూ తూర్పుగోదావరి, కాకినాడ, అంబేడ్కర్‌ కోనసీమ జిల్లాల పరిధిలోని పీఎంశ్రీ పాఠశాలల స్కౌట్‌ టీచర్స్‌కు బేసిక్‌, అడ్వాన్స్‌ కోర్సులకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. దీనిపై భారత్‌ స్కౌట్‌ అండ్‌ గైడ్స్‌ రాష్ట్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. మూడు జిల్లాలకు చెందిన 88 పీఎంశ్రీ పాఠశాలలకు సంబంధించి స్కౌట్‌ టీచర్లకు శిక్షణకు హాజరవుతారన్నారు. రెసిడెన్షియల్‌ విధానంలో ట్రైనింగ్‌ నిర్వహిస్తామన్నారు. హెచ్‌ఎం జానకీదేవితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన సెల్ఫ్‌ అసెస్మెంట్‌ పరీక్షల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు

బాలికల సాధికారతపై అవగాహన సదస్సు

కపిలేశ్వరపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలిక కుటుంబానికి వెలుగు, భావితరం అభివృద్ధికి పునాది అని వక్తలన్నారు. మండలంలోని అంగర శ్రీ సిద్దార్ధ కళాశాలలో అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ రత్నకుమారి ఆధ్వర్యంలో మంగళవారం లింగవివక్షత, బాలికల సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో సమాన అవకాశాలు కల్పించకపోతే సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదన్నారు. బాలికల హక్కులు, ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించాలని భేటీ హాయితో దేశ్‌ హాయ్‌ అని అన్నారు. వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడం, రక్తహీనత నివారించడం, వైద్య, ఆరోగ్యశాఖ కర్తవ్యమన్నారు. పోషకాహారం అందించడం ఐసీడీఎస్‌ కర్తవ్యమన్నారు. ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో జె.మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెచ్‌ఈవో రామారావు, హెచ్‌వీ మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పి ఎస్‌. దేవి, ఆరోగ్య కార్యకర్తలు వి.వెంకటేశ్వర్లు, సీహెచ్‌ దుర్గ, ఆశా కార్యకర్తలు, కాలేజ్‌ కరస్పాండెంట్‌ వి.పరమేశ్వరరావు, అధ్యాపకులు, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా ఏమైంది?

కామన ప్రభాకరరావు



మండపేట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన విభజన హామీకి 12 ఏళ్ల పూర్తయినా నేటికీ అమలుకి నోచుకోలేదని కాంగ్రెస్‌ పార్టీ కిసాన్‌ సెల్‌ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ ప్రత్యేక హోదా మరిచిపోవటం దారుణమన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్యాకేజీ లు ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు. ప్రత్యేక హోదాపై కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని విద్యుత్‌ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో కూటమి ప్రభుత్వ వైఖరిని కామన తప్పుపట్టారు. వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్మికుల ఆందోళనకు తమ పార్టీ అండగా ఉంటుందన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

'సీబీఐ విచారణ చేయాలి'

మండపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యం ఘటనపై తక్షణమే సీబీఐ విచారణ నిర్వహించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. మంగళవారం ఆయన స్థానిక ఆ పార్టీ శ్రేణులతో కలిసి బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌ తేజేశ్వరరావుకు వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పతివాడ నూకదుర్గారాణి తదితరులతో పాటు స్థానిక వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

'చెడు అలవాట్ల వల్లే గుండెపోటు మరణాలు'

కపిలేశ్వరపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జీవనశైలిలో పెను మార్పులు, చెడు ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమలేకపోవడం వల్లే అనేక మంది గుండెపోటుకు గురవుతున్నారని వక్తలన్నారు. మంగళవారం అంగర పీహెచ్‌ వైద్యాధికారి రత్నకుమారి ఆధ్వర్యంలో సిద్దార్థ కాలేజీలో పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ అంగర మల్టీపర్పస్‌ హెల్త్‌ ఎక్స్‌టెన్షన్‌ ఆఫీసర్‌ మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెల్త్‌ ఎడ్యుకేషన్‌ ఆఫీసర్‌ బి.రామారావు, హెచ్‌వీ మేరీమణి, ఎంఎల్‌హెచ్‌పి దేవి, కళాశాల కరస్పాండెంట్‌ వాకా పరమేశ్వరరావు, అధ్యాపకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గుండెపోటుకు గురైన సందర్భాల్లో ప్రథమ చికిత్స అందిస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు. దీనివల్ల వైద్యం అందే లోపు ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అమలాపురం రూరల్‌, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నడిపూడి లాకులను దాటుకుని ఈదరపల్లి వంతెన వైపు కొట్టుకు వస్తున్న గుర్తు తెలియని మృతదేహాన్ని మంగళవారం స్థానికులు గుర్తించారు. నడిపూడి బైపాస్‌ రోడ్డులోని జగ్జీవన్‌రామ్‌ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న ప్రధాన పంటకాల్వ తుప్పల్లో మృతదేహం చిక్కుకుపోయింది. మూడు రోజులుగా అక్కడే ఉండిపోవడం వల్ల దుర్వాసన వస్తున్నదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.

ఆక్రమణలపై స్థానికుల ఫిర్యాదు

అంతర్వేది, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గుడిమూల గ్రామంలో పుష్కరరేవు, శ్మశానవాటిక ఆక్రమణలకు గురైందని తహశీల్దార్‌ గ్రీవెన్స్‌లో మంగళవారం తహశీల్దార్‌ ఎం.వెంకటేశ్వరరావుకు స్థానికులు ఫిర్యాదు చేశారు. గుడిమూలలో ఏటిగట్టు పుష్కరరేవుకు, శ్మశానవాటికకు వెళ్లే రహదారికి ఇరువైపులా ఆక్రమణలకు గురైందన్నారు. పుష్కరరేవులో కొంత స్థలాన్ని ఆక్రమించారన్నారు. కందుల సూర్యచంద్రరావు, గుబ్బల పెద్దిరాజు, మన్నే వెంకన్న, స్థానికులు పాల్గొన్నారు.


గుడిమూల ఆక్రమణల తొలగింపుపై ఫిర్యాదు చేస్తున్న స్థానికులు



ఆకట్టుకున్న కోలాటం

ఆత్రేయపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాన్ని భక్తజనం ఆసక్తిగా తిలకించారు.

కల్తీ మద్యానికి కేరాఫ్‌ అడ్రస్‌ వైసీపీయే

• నియోజకవర్గంలో కల్తీ మద్యం ఉంటే చూపించండి • వైసీపీ నేతలకు ఎమ్మెల్యే వేగుళ్ల సవాల్‌


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యం తాగి మృతి చెందిన ఘటనలు మరిచారా? అని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు వైసీపీ నేతలను ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో లిక్కర్‌ అంతా కల్తీయేనని అప్పట్లో ఎంతో మంది దాన్ని తాగి అనారోగ్యం పాలవడంతో పాటు మృతి చెందిన ఘటనలు మరిచి ఇప్పుడు కల్తీ మద్యం అంటూ ఆ పార్టీనేతలు రాద్ధాంతం చేయడం సిగ్గుచేటన్నారు. మంగళవారం టీడీపీ పట్టణ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నాణ్యత కలిగిన మద్యాన్ని విక్రయిస్తున్నదని ఎమ్మెల్యే తెలిపారు. మండపేట నియోజకవర్గంలో ఎక్కడైనా కల్తీ మద్యం విక్రయిస్తే పట్టుకోవాలని ఆయన వైసీపీ నేతలకు సవాల్‌ చేశారు. సమావేశంలో మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ చుండ్రు శ్రీవరప్రకాష్‌, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మచ్చా నాగు, ఉండవల్లి రాంబాబు, పిల్లా తాతాలు, టీఎన్‌టీయుసీ రాష్ట్ర ప్రతినిధి వాదా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా ఘటనపై కమిటీ నియామకం: రాయవరం బాణసంచా పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి విచారణ కమిటీని నియమించిందని ఎమ్మెల్యే వేగుళ్ల అన్నారు. మండపేటలో మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రమాద ఘటన జరిగిన వెంటనే రాష్ట్ర హోంమంత్రి, జిల్లా అధికార యంత్రాంగం వచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. నేటికీ నష్టపరిహారం ఇవ్వలేదంటూ రాద్ధాంతం చేస్తున్న పార్టీల తీరును ఆయన తప్పుపట్టారు. బాధిత కుటుంబాలను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ చుండ్రు శ్రీవరప్రకాష్‌, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ వీరెడ్డి, పిల్లా తాతాలు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎం.నాగు, వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వాయులింగానికి పూజలు చేస్తున్న విశ్రాంత సీజే ఎన్‌వీ రమణ దంపతులు

భీమేశ్వరాలయంలో విశ్రాంత సీజే ఎన్‌వీ రమణ పూజలు

ద్రాక్షారామ, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని మంగళవారం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఎన్‌వీ రమణ సతీసమేతంగా సందర్శించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలోని వాయు లింగానికి స్వయంగా ఆయన అభిషేకం చేశారు. స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం నంది మండపంలో వారు వేదపండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయన వెంట రామచంద్రపురం మేజిస్ట్రేట్‌ నాగేశ్వరరావు నాయక్‌, ద్రాక్షారామ ఎస్‌ఐ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహారదీక్ష

ముమ్మిడివరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో బస్టాండును వెంటనే పునరుద్ధరించి ప్రజలకు అవసరమయ్యే సౌకర్యాలను కల్పించాలని కోరుతూ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్‌ తహశీల్దార్‌ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్ష మంగళవారం కూడా కొనసాగింది. దీక్షా శిబిరాన్ని అయినాపురం అంబేడ్కర్‌ యువజన సంఘ నాయకులు బరకట వరప్రసాద్‌, నీలం చినబాబు, యడ్ల చిట్టిబాబు, బడుగు రాంబాబు, గూటం నానాజీ, కన్నీడి వెంకటరమణ, మెండి దుర్గాప్రసాద్‌, జంగా నాగేశ్వరరావు, కాశి మూర్తి, జనిపల్లి వెంకటేశ్వరరావు, బీర బాలకృష్ణ, దళిత నాయకులు మెండి కృష్ణబాబు సందర్శించి సంఘీభావం తెలిపారు. బస్టాండును వెంటనే పునరుద్ధరించాలని వారు డిమాండ్‌ చేశారు.



కొత్తపేటలో జీఎస్టీపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. పక్క చిత్రంలో రామచంద్రపురంలో సూపర్‌ జీఎస్‌టీ..సూపర్‌ సేవింగ్స్‌పై అవగాహన సమావేశంలో ఆర్డీవో తదితరులు

జీఎస్టీ ఫలాలు ప్రజలకు అందాలి

కొత్తపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ఫలాలు వినియోగదారులకు అందేలా సంబంధిత అధికారులు పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్‌ ప్రాంగణంలో సూపర్‌ జీఎస్టీ, సూపర్‌ సేవింగ్స్‌పై అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏ వస్తువులపై ఎంత జీఎస్టీ తగ్గించారో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు ఏమైనా సందేహాలు, ఫిర్యాదులు ఉన్నప్పుడు టోల్‌ఫ్రీ నెంబరు 1915 ద్వారా సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జీఎస్టీ అసిస్టెంట్‌ కమిషనరు పి.వెంకటేశ్వరరావు, ఎంపీడీవో నరేష్‌ కుమార్‌, సర్పంచ్‌లు బూసి జయలక్ష్మి, పల్లి భీమరావు, మిద్దే ఆదినారాయణ, ముత్యాల బాబ్జి, గనిశెట్టి వీరేష్‌, ఉపసర్పంచ్‌ విళ్ల మారుతీ ప్రసాద్‌, కంఠంశెట్టి శ్రీనివాస్‌, పాలూరి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ రంగానికి ఊతం

రామచంద్రపురం(ద్రాక్షారామ) (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ తగ్గింపు వల్ల భవన నిర్మాణ రంగానికి చాలా ఊతమిస్తుందని ఆర్డీవో దేవరకొండ అఖిల అన్నారు. మంగళవారం స్థానిక కల్యాణ మండపంలో సూపర్‌ జీఎస్‌టీ, సూపర్‌ సేవింగ్స్‌ కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం ఒకేదేశం, ఒకేపన్ను విధానంతో జీఎస్‌టీ సంస్కరణలు తీసుకు వచ్చిందన్నారు. గతంలో 4 శ్లాబులుగా ఉన్న జీఎస్‌టీని 2 శ్లాబులుగా మార్పులు చేసి ప్రజలకు మేలు జరిగేలా తీసుకువచ్చారన్నారు. కూటమి నాయకుడు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ జీఎస్‌టీ సంస్కరణలు దేశ చరిత్రలో నూతన అధ్యాయమన్నారు. వాణిజ్య పన్నులశాఖ జాయింట్‌ కమిషనర్‌ సీహెచ్‌ రవికాంత్‌ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రతి వస్తువుపై జీఎస్‌టీ తగ్గింపు అమలు జరిగేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జీఎస్‌టీ అసిస్టెంటు కమిషనర్‌ పి.సత్యనారాయణ, మున్సిపల్‌ డీఈఈ శ్రీకాంత్‌, చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడు కొప్పూరి తాతారెడ్డి, కార్యదర్శి సత్తిబాబు, ఎస్‌కెపిపి ట్రస్టు చైర్మన్‌ సలాది నాయుడు మాస్టర్‌, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, కడియాల రాఘవన్‌, కవల నానాజీ, మేడిశెట్టి శేషారావు, మేడిశెట్టి సూర్యనారాయణ, వైట్ల గజలక్ష్మి, జాస్తి విజయలక్ష్మి, బళ్ల లక్ష్మి, భవన నిర్మాణ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బిళ్లకుర్రులో కేంద్ర బృందం పరిశీలన

కొత్తపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర బృందం సభ్యుడు ఉమేస్‌ కుమార్‌రామ్‌ కోరారు. మంగళవారం బిళ్ళకుర్రులో వాటి అమలుతీరును కేంద్ర బృంద సభ్యులు పరిశీలించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం వేతన పనిదినాలు, మెటీరియల్‌తో చేసే అభివృద్ధి పనులు ఎన్‌ఆర్‌ఎల్‌ఎం పథకం ద్వారా పేద ప్రజల ఆర్థిక అభివృద్ధి కోసం బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరైన యూనిట్లను పరిశీలించారు. ప్రధానమంత్రి ఆవాస్‌ యోజన పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలు, ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకాలను పరిశీలించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేసి లబ్ధిదారులు కేంద్ర పథకాలతో ఏ విధంగా ఆర్థికంగా నిలదొక్కుకున్నారో తెలుసుకున్నారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యుడు మయూర్‌ వర్మ, ఏపీడీ జి.మహేశ్వరరావు, ఎంపీడీవో నరేష్‌కుమార్‌, పంచాయతీరాజ్‌ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ డి.వీరభద్రరరావు, హౌసింగ్‌ డీఈ దరణాల శ్రీనివాస్‌, ఏఈ గణేష్‌ కుమార్‌, ఏపీవో నెల్లి ఆనందకుమార్‌, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.


కొత్తగా చేరిన టీచర్లకు సర్వీసు రిజిష్టర్‌ను అందజేస్తున్న దృశ్యం

సర్వీసు రిజిష్టర్ల అందజేత

కె.గంగవరం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2025 ద్వారా మండలంలో విధుల్లో చేరిన 23 మంది ఉపాధ్యాయులకు మంగళవారం పీఆర్‌టీయూ సంఘం సర్వీసు రిజిష్టర్లను అందజేశారు. ఈ పుస్తకం వారి జీవితాంతం ఉపయోగపడుతుందని పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఓదూరి వెంకట రమణ అన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఢమరుకనాధం, నాయకులు డి.లోవరాజు, నేదునూరి వేణుగోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందిస్తాం

మండపేట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండపేటలోని గొల్లపుంతలో వున్న టిడ్కో ఫేజ్‌2లోని ఇళ్లను డిసెంబరునాటి కల్లా లబ్ధిదారులకు అందిస్తామని మండపేట మున్సిపల్‌ కమిషనర్‌ టీవీ రంగారావు తెలిపారు. మున్సిపల్‌ కార్యాలయంలో మంగళవారం ఆయన టిడ్కో, మున్సిపల్‌ అధికారులతో సమావేశం నిర్వహించారు. రెండో విడతలో వున్న ఇళ్లకు సంబంధించి పెండింగ్‌ పనులు సత్వరమే పూర్తి చేయాలని టిడ్కో అధికారులను కమిషనర్‌ కోరారు. ఫేజ్‌1లో ఉన్న పెండింగ్‌ పనులు కూడా సత్వరమే పూర్తి చేయాలన్నారు. బ్యాంకు లింకేజ్‌కు సంబంధించిన పనులు కూడా సత్వరమే పూర్తి చేయాలన్నారు. మార్ట్‌గేజ్‌ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. ప్రతి మంగళవారం టిడ్కో గృహాలపై సమీక్ష నిర్వహిస్తామని కమిషనర్‌ తెలిపారు. సమావేశంలో టిడ్కో ఏఈ వివేక్‌, మున్సిపల్‌ ఏఈలు దాసరి పవన్‌, అనుషా తదితరులతో పాటు కేసీపీ ప్రతినిధులు పాల్గొన్నారు.


టిడ్కో మున్సిపల్‌ ఇంజనీరింగ్‌ అధికారులతో సమీక్ష జరుపుతున్న కమిషనర్‌ రంగారావు